# నలుగురిలో ఆమె

జి.సి.జోని

దాదాపు ఐదు వందలకి పైగా ఉద్యోగు లున్న ప్రభుత్వ రంగంలోని ఒక బ్యాంకు బ్రాంచి అది. పదింటికి ఆఫీసు అని పేరే గాని, పదిన్నర దాటేక గాని ఆఫీను సిబ్బందిని వారి వారి సీట్లలో చూడలేం. అటువంటిది తొమ్మిదిన్నరకే ఆఫీసు కొచ్చిన ఆమె కేసి వింతగా చూసి, వినయంగా సెల్యూట్ చేశాడు గేటు ముందున్న గూర్ఖా.

చిరునవ్వుతో అతనిని పలకరించి, లోపలికి నడిచింది వినోద.

లిఫ్టు కోసం ఐదు నిముషాలు ఎదురు చూసి మెట్లెక్కి రెండో అంతస్తు చేరుకుంది. కుర్చీలు, టేబుళ్లూ తుడుస్తున్న స్వీపర్ తప్ప ఆఫీ నంతా నిర్మానుష్యంగా కనిపించింది. మేనేజర్ కేబిన్ ముందున్న బెంచ్ మీద కూర్చుని ఫైల్లో సర్టిఫికెట్లన్నీ సరిగ్గా ఉన్నాయో, లేదో ఒకసారి చూసుకుంది.

సరిగ్గా పది గంటలకు ఫుల్ సూటులో మేనేజర్ తన కేబిన్‌లోకి ప్రవేశించాడు. వయసు నలభై అయిదూ - యాభైకి మధ్య ఉండొచ్చు. కేబిన్ ముందు యూనిఫారంలో నిలబడి ఉన్న ప్యూన్‌ను సమీపించి తన అప్పాయింట్‌మెంట్ ఆర్డర్‌ని చూపించింది వినోద. అయిదు నిముషాల తరువాత లోపలకు రమ్మని పిలు పొచ్చింది. లోపలికి ప్రవేశించి మేనేజర్ ముందు నుంచుని, "గుడ్ మార్నింగ్, సర్!" అంది మృదువైన కంఠంతో.

సీసా మూత తీసి, రెండు మాత్రలు నోట్లో వేసుకుని నీళ్లు తాగి, "సిడౌన్ సిడౌన్!" అన్నాడు మేనేజర్. ఎదురుగా ఉన్న కుర్చీలో ఆసీనురాలై, చేతిలోని ఫైలు ఆయనకు అందించి పమిట సరిచేసుకుంది.

"వినోద. వినోదమైన పేరు" అన్నా డాయన అపాయింట్‌మెంట్ ఆర్డర్స్‌ని చూస్తూ.

చిన్నగా నవ్వింది.

"ఐ యామ్ పానకాలరావు. ఎస్. పానకాలరావు. బ్రాంచ్ మేనేజర్‌ని."

"తెలుసండీ!"

"తెలుసా? ఎట్లా తెలుసు?"

"మీ కేబిన్ ముందు రాసి ఉంది కదండీ!"

"దట్స్ రైట్! మీరు తెలివైనవారు. ఐ లైక్ యు. ఈ రోజే చేరుతున్నారా?"

"అవును, సార్!"

ఫోనులో ఎవరితోనో మాట్లాడాడు పానకాలరావు. కాసేపటికి సెక్షన్ హెడ్ వరాంకుశం లోపలికి వచ్చాడు.

"ఈ అమ్మాయికి మన ఆఫీసంతా చూపించు. అన్నట్టు నీ సెక్షన్‌కి ఒక టైపిస్టు కావా లన్నావు కదూ! ఈ అమ్మాయినే వేసుకో! విష్ యు ఆల్ ది బెస్ట్ వినోదా!"

"థాంక్యూ, సర్!" అంటూ వరాంకుశం వెంట నడిచింది.

అప్పుడు సరిగ్గా పదిన్నర కావస్తోంది. ఆఫీసులోని కుర్చీ లన్నీ నిండుతున్నాయి. డిపార్ట్‌మెంట్లన్నీ చూపించి, చివరగా అడ్మినిస్ట్రేషన్ సెక్షన్‌కి తీసుకొచ్చాడు వినోదను వరాంకుశం.

"ఇదమ్మా మన సెక్షన్. నేను సెక్ష నాఫీసర్ని. పేరు వరాంకుశం. అదుగో, ఆ ఎదురుగా ఉండేదే నీ సీటు ప్రస్తుతానికి."

ఆయనకు థాంక్స్ చెప్పి కదలబోయింది వినోద.

"ఆ గాగు! నీకు ఈ ఆఫీసు గురించి కొంత హితోపదేశం చేయాలి. ఈ ఆఫీసులో ఎవరితో పేచీలు పెట్టుకున్నా పరవాలేదు గాని, రవికుమార్‌తో మాత్రం గొడవ పెట్టుకోకు. పెట్టుకున్నావో, ఒక్క రోజు కూడా పని చేయలేవు నువ్వీ ఆఫీసులో" అన్నాడు వరాంకుశం.

"ఎవరండీ ఆయన? అంత గొప్పవాడా?" అడిగింది ఆశ్చర్యంగా వినోద.

"ఈ బ్రాంచ్ మేనేజర్ కూడా మన జనరల్ మేనేజర్ గారి ముందు నిలబడే మాట్లాడతాడు. కానీ కాలు మీద కాలేసు క్కూర్చుని, సిగరెట్ పొగ వదులుతూ జి.ఎమ్.తో మాట్లాడగలిగేది రవికుమార్ ఒక్కడే."

"అంటే, బ్యాంక్ ఛైర్మనా అతను?"

"అంతకంటే ఎక్కువే. స్టాఫ్ యూనియన్ సెక్రటరీ, తల్లీ, ఆయన."

"ఊహుఁ."

'ఇకపోతే, మన సెక్షన్ ప్యూను త్యాగరా జున్నాడు చూడు ..."

"ఎక్కడండీ?"

"ఇంకా రాలేదులే. పదకొండు దాటితే గాని ఆ మహానుభావుడు మన క్కనిపించడు. సారా వానన గుప్పుమందీ అంటే మాత్రం ఆ రాజు గా రొచ్చా రని అర్థం. తను నిజంగా ఆ 'త్యాగరాజు' అవతార మనే అతని నమ్మకం. ఎప్పుడూ ఏవో కూనిరాగాలు తీస్తూంటాడు. నువ్వు విను క్కున్నట్టు కనిపించినా, నవ్వినట్టు అనిపించినా బూతులు తిడతాడు జాగ్రత్త. ఇక హెడ్ టైపిస్ట్-కమ్-స్టెనో - రోసీ - నీ పక్క సీటే ఆవిడది. నేను చెప్పడం ఎందు గ్గానీ, నువ్వే తెలుసుకుంటావు. చివరగా మనందరికీ మొగుడులాంటివాడైన -. అహఁ - ఒద్దులే! పెద్ద వాళ్ల గురించి చిన్నవాళ్లు ఇంకా చిన్నవాళ్లకి చాడీలు చెప్పకూడదు."

"ఎవరి గురించండీ, మీ రనేది? మన మేనేజర్ గురించేనా?" అడిగింది వినోద.

"అమ్మమ్మా! పెద్దగా అనకు తల్లీ! ఈ ఆఫీసులో గోడలకు మాత్రమే కాదు, కుర్చీలకీ, టేబుళ్లకి కూడా చెవు లుంటాయి. మన కెందుగ్గానీ, వెళ్లి నీ పని చూసుకో" అని ఫైలు తెరిచాడు వరాంకుశం.

**    **    **

పన్నెండున్న రయింది. ఆఖరి లెటర్ టైపు చేసి, భోజనానికి లేవబోతూండగా అదే సెక్షన్‌లో పనిచేస్తున్న రామారావు వినోద దగ్గరకు వచ్చి, "గురువు గారు మిమ్మల్ని పిలుస్తున్నారు" అన్నాడు.

"ఇక్కడ నా కెవరూ గురువు ల్లేరే!" అంది నవ్వుతూ వినోద.

"జోక్ బాగానే ఉంది గాని, రండి నాతో" అన్నా డతను సీరియస్‌గా.

"ఎక్కడికి?"

"కామ్రేడ్ మిమ్మల్ని చూడా లంటున్నారు. జాయినింగ్ రిపోర్టిచ్చిన వెంటనే కామ్రేడ్‌ని కలుసుకుని ఉండాల్సింది మీరు. చాలా ఆలస్యం చేశారు. పదండి!"

గ్రౌండ్ ఫ్లోర్‌లో కేంటీన్‌కి వెళ్లే దారిలో ఉంది స్టాఫ్ యూనియన్ గది. రామారావుతోపాటు లోపలికి ప్రవేశించింది వినోద. తాగుతున్న సిగరెట్‌ని యాష్ ట్రేలో అదిమిపెట్టి, ఒక్క క్షణం ఆమెకేసి చూసి, "కూర్చోండి" అని కుర్చీ చూపించాడు యూనియన్ సెక్రటరీ కామ్రేడ్ రవికుమార్. వయస్సు ముప్పై - ముప్పై అయిదుకి మధ్య ఉంటుంది. టెరీకాటన్ పాంటు మీద గోధుమ రంగు ఖద్దరు జుబ్బా వేసుకుని ఉన్నాడు. గుండీలు పెట్టకుండా వదిలేసిన ఆ జుబ్బాలోంచి ఛాతీ కనబడుతోంది. దువ్వకుండా అలక్ష్యంగా వదిలేసినట్టున్న ఒత్తైన క్రాఫు. మనిషి చామన చాయ అయినా ఏదో ఆకర్షణ తొంగి చూస్తోంది అతనిలో.

"మీ పేరు?" ప్రశ్నించాడు.



"వినోద."

"ఈరోజే జాయినయ్యారా?"

"అవును."

"అమ్మా, నాన్నా ఈ ఊళ్లోనే ఉన్నారా?"

"లేరు."

"ఎక్కడున్నారు?"

"ఎక్కడా లేరు." విసురుగా చెప్పింది. ఆమెలో సహనం నశిస్తోంది.

"తల్లిదండ్రులు లేకుండానే జన్మించిన స్వయంభవురాలి వన్నమాట నువ్వు!" ఆ మాటలకి అతని చుట్టూ ఉన్న శిష్య గణం పళ్లికిలించారు.

వినోద ముఖం కోపంతో కందిపోయింది. చివాల్న కుర్చీలోంచి లేచింది.

"మిస్టర్! మర్యాదగా మాట్లాడటం చేతకాదా మీకు? అసలు మీ రెవరు నన్నీ ప్రశ్న లడగటానికి?" అనేసి చరచరా ఆ గదిలోంచి బయటకు నడిచిందామె.

అక్కడున్న వాళ్లంతా నివ్వెరపోయి చూస్తున్నారు. అంతవరకు తమ నాయకుణ్ణి అలా ఎదిరించి మాట్లాడిన వా ళ్లెవరూ లేరు.

** ** **

సారా వాసన గుప్పు మనేసరికి తిరిగి చూసింది వినోద. ఆమె కుర్చీ మీద చేతు లానించి తూలుతూ నుంచుని ఉన్నాడు ప్యూను త్యాగరాజు. అతని పక్కనే డిస్పాచ్ సెక్షన్ ప్యూన్ రామలింగం. అప్పుడు గంట పదకొండు దాటి ఉంటుంది.

"గుడ్ మార్నింగ్, మేడమ్! మిమ్మల్ని డిష్టబ్ శేస్తున్నందుకు షారీ! మీరు శిరిదేవిలా ఉన్నారని వీడూ, కాదు జయప్రదలాంటి క్లాసికల్ బ్యూటీ మీది అని నేనూ వాదించుకుంటున్నాం. మీరే చెప్పండి - మీ రెవరు? శ్రీదేవా, లేక జయప్రదా?"

ఏ మాత్రం కోప్పడకుండా సౌమ్యంగా నవ్వింది వినోద.

తన పక్కనున్న స్టూల్‌ని అతనికి దగ్గరగా జరిపి, "ముందు కూర్చోండి, చెప్తాను" అంది.

"ఊఁ, కూర్చున్నాను. చెప్పండి."

"నేను శ్రీదేవినీ కాను, జయప్రదనూ కాను. నేను నేనే!" అని నవ్వింది.

"పోనీ ఇది చెప్పండి. 'దేవీ .... శ్రీదేవీ' పాట బాగుంటుందా, 'ఝుమ్మంది నాదం, సయ్యంది పాదం' పాట బాగుంటుందా?" అన్నాడు త్యాగరాజు ఆ పాటల చరణాలను భావయుక్తంగా పాడి.

"ఝుమ్మంది నాదమే బాగుంది" చెప్పింది వినోద.


"సెభాస్! నేనే గెలిచాను. ఒరేయ్ రామలింగం! తే ముప్పై రూపాయలు. మందు దిగిపోతున్నది. ఒక క్వార్టర్ రేసుకుని రావాలి" అంటూ మిత్రుడి జేబులోకి చెయ్యి పోనిచ్చాడు త్యాగరాజు.

"నేను పందెం కాసింది మూడు రూపాయలే. ముప్పై అంటా వేం? ముందు చెక్కా వదులు!" అంటూ గింజుకున్నాడు రామలింగం.

"అయ్ భాంచెత్! నే నేమైనా తాగి వాగుతున్నా ననుకుంటున్నావ్ బే! తియ్ ముప్పై!" అని అరిచాడు త్యాగరాజు.

అద్దంలో చూసుకుంటూ పెదాలకు రంగు వేసుకుంటున్న స్టెనో రోసీ లిప్‌స్టిక్‌ని హేండ్‌బ్యాగ్‌లో పడేసి విసురుగా వచ్చింది వినోద సీటు దగ్గరకు.

"బిహేవ్ యువర్‌సెల్ఫ్ మాన్! ఇ దేమైనా ఆఫీ సనుకున్నావా, లేక




సారా కొట్టు అనుకున్నావా? డీసెంట్‌గా బిహేవ్ చేయటం తెలియదా నీకు? సీ మిస్ వినోదా! ఇతణ్ణి గురించి తెలియదు నీకు. ఈ ఆఫీసు కో పెద్ద న్యూసెన్స్! డోంట్ ఎంకరేజ్ హిమ్!" అంది రోసీ సీరియస్‌గా.

"చూడు, రోసమ్మా! నిన్ను చూస్తేనే మా కంత రోత. మోకాళ్ళపైకి మినీ స్కర్టు, చేతు ల్లేని జాకెట్టు, నగం కనిపించే ఛెస్టు - 'ఇన్-డీసెంట్ ఎక్స్‌పోజర్' గురించి మాట్లాడుతున్నావా తల్లీ!" అన్నాడు త్యాగరాజు రోసీని చూసి చేతు లూపుతూ.

"స్టూపిడ్ మేన్! ఇప్పుడే నీ మీద కంప్లైంట్ టైప్ చేసి మేనేజర్‌కి పంపిస్తాను, చూడు!" అంటూ విసవిసా తన సీటు దగ్గర కెళ్లి కూర్చుంది రోసీ.

** ** **

సాయంత్రం ఆరు గంటలు.

సినిమా థియేటర్ ముందు బస్‌స్టాప్‌లో నుంచుంది వినోద. అటువైపుగా స్కూటర్ మీద వెళ్తున్న రవికుమార్ ఆమెను చూసి స్కూటర్ ఆపాడు.

"హల్లో కామ్రేడ్ వినోదా! ఏమిటీ, మీ రిక్కడ?"

"మా ఇంటి పేరు కామ్రేడ్ వారు కాదు." నవ్వి అన్నది.

"పోనీ మీ ఇంటిపే రేమిటో చెప్పండి. దాంతోనే పిలుస్తాను."

"ఆడవాళ్లని ఇంటిపేరుతో పిలిస్తే బాగుండదు."

"అదీ నిజమే. సినిమా కొచ్చారా?"

"ఊఁ."

"రండి, మీ హాస్టల్ దగ్గర డ్రాప్ చేస్తాను."

"వద్దులెండి. థాంక్స్!"

"ఈరోజు ఆదివారం. బస్సులు తక్కువ. సినిమాలు వదిలే వేళ. ఒకవేళ మీ బ స్సొచ్చినా, ఇక్కడ ఆగదు. ఆగినా, మీ రెక్కలేరు. పోనీ మా ఇంటికి రాకూడదూ! ఇక్కడికి చాలా దగ్గరే."

సమాధానం చెప్పకుండా బస్సు కోసం రోడ్డు చివర కేసి చూస్తోంది వినోద.

"నా వెనుక కూర్చోవడానికి అభ్యంతరమైతే నడిచే వెళ్దాం పదండి!" అంటూ స్కూటర్ దిగబోయాడు రవికుమార్.

ఒక్క క్షణం ఆలోచించి, "సరే పదండి!" అని స్కూటర్ వెనుక సీట్లో కూర్చుంది వినోద.

రెండు మలుపులు తిరిగి ఒక ఇంటి ముం దాగింది స్కూటర్. మెట్ల పక్కన స్కూటర్‌ని పార్క్ చేసి, మేడ మెట్లెక్కి తాళం తీసి, "రండి!" అంటూ ఆహ్వానించాడు రవి.

అంత పెద్దదీ, చిన్నదీ కాని నుమారైన గది, ఒక బాత్‌రూమ్. అంతే ఆ పోర్షను. ఒక టేబుల్, ఒక కుర్చీ. అల్మైరా నిండా ఇంగ్లీషు, తెలుగు సాహిత్యాలకు సంబంధించిన మంచి మంచి పుస్తకాలు. నేల మీద పరచిన చాపల మీద చిందర వందరగా పత్రికలు - 'విమెన్ ఆఫ్ చైనా', 'రాడికల్ రివ్యూ', 'టైమ్స్ లిటరరీ సప్లిమెంట్' - వీటితోపాటు కార్మికోద్యమానికి సంబంధించిన కొన్ని విదేశీ పత్రికలు, బుచ్చిబాబు 'చివరకు మిగిలేది', సత్యజిత్ రే మీద మేరీ సీటన్ రాసిన పుస్తకం పడి ఉన్నాయి. వాటిని గోడవారగా సర్దిపెట్టి, "కూర్చోండి" అన్నాడు.

గోడకు చేరగిలబడి మోకాళ్ల చుట్టూ చేతులు బిగించి కూర్చుంది. గదినంతా ఒకసారి కలయజూసి, "మీ కింకా పెళ్లి కాలేదా?" అని అడిగింది.

"ఈ గదిని చూస్తుంటే తెలియడంలేదా?" అని చిన్నగా నవ్వి, గోడకు తగిలించి ఉన్న ఒక పాత ఫోటోని తీసి వినోద చేతి కిచ్చాడు రవి.

ఇద్దరు వృద్ధ దంపతులు, ఒక పదహారేళ్ల పిల్లవాడు, పదేళ్ల అమ్మాయి ఉన్నారు ఆ ఫ్రేములో.

"ఇప్పుడు నా కంటూ ఎవరైనా ఉంటే ఈ ముసలి తల్లి మాత్రమే. కాని ఆమె కూడా నా దగ్గర లేదు.

"నీకు తల్లి కావాలంటావు. కాని ఈ నేల తల్లిని విడిచిపెట్టి నే నెట్లా రాను నాయనా! అంటుంది ఆమె" చెప్పాడు.

ఫోటోలోని అబ్బాయి కేసి కొద్ది క్షణాలపాటు చూసి, రవి ముఖంలోకి చూసింది వినోద.

అతను నవ్వుతూ, "అవును. నేనే!" అన్నాడు. టూకీగా తన గురించి చెప్పాడు.

ఒక పల్లెటూళ్లోని పేద కుటుంబంలో పుట్టి స్వయం కృషితో చదువుకున్నా డతను. యూనివర్సిటీ గోల్డ్ మెడలిస్ట్. కాలేజీలో లెక్చరర్‌గా ఉద్యోగం చేశాడు కొన్నాళ్లు. క్లాసులో పాఠాలు చెప్పకుండా తీవ్రవాద రాజకీయాలు బోధిస్తున్నా డని డిస్మిస్ చేశారు. బ్యాంక్ క్లర్క్ ఉద్యోగానికీ, ఆఫీసర్ ఉద్యోగానికీ పరీక్షలు రాశాడు. రెండింటికీ సెలక్టయ్యాడు. కాని క్లర్క్ ఉద్యోగాన్నే ఎంచుకున్నాడు.

"అదేమిటీ?" ఆశ్చర్యం వ్యక్తం చేసింది వినోద.

"ఎందుకనో మొదటి నుంచీ అధికారు లన్నా అధికారం చెలాయించడమన్నా నా కో రకమైన ఎలర్జీ" అని, కాసేపాగి అన్నాడు - "అయినా, ఆఫీసర్నయి ఉంటే మీలాంటి అందమైన అమ్మాయితో ఇంత సన్నిహితంగా మాట్లాడే అవకాశం కూడా ఉండేది కాదేమో కదా!"

సిగ్గుతో ఆమె బుగ్గలు ఎరుపెక్కలేదు.

"ఆలస్యమయింది. ఇక వెళ్తాను" అంటూ లేచింది.

** ** **

రాత్రి పది గంటలు.

వీల్ ఛెయిర్‌లో ఉన్న భార్యకు నాలుగు రకాల మాత్రలు నోట్లో వేసి, నీళ్లు తాగించాడు పానకాలరావు. కుర్చీలోంచి ఆమెను రెండు చేతులతోనూ లేవనెత్తి బెడ్ మీద పడుకోబెట్టాడు. వెన్నెముకలో ఏదో జబ్బు ఆవిడకి. ఆ వీల్ ఛెయిరూ, ఆ మంచం - ఇవి తప్పించి నేల మీద నడిచి ఆరు నెలలయింది ఆవిడ, పాపం! ఎంతమంది డాక్టర్లకో చూపించాడు. కీళ్ల వాత మన్నారు. కేన్సర్‌లాంటిదే నన్నారు. వెన్నెముకలో టి.బి. అన్నారు. మరోటి మరోటి అన్నారు. కాని ఆమె వ్యాధిని మాత్రం ఎవరూ నయం చేయలేకపోయారు. నొప్పి తగ్గడానికీ, నిద్రపోవడానికీ మాత్రం మందులు రాసిచ్చారు.

"ఆ బెడ్ పాన్ ఇలా పెట్టండి" అంది విశాలాక్షి మూలుగుతూ.

విసుక్కుంటూ మంచం కింద నుంచి బెడ్ పాన్ పెట్టాడు పానకాలరావు.

ఉదయం తొమ్మిది గంటల నుంచి సాయంత్రం ఆరుదాకా భార్యకు సేవలు చేయడాని కని ఒక ప్రైవేట్ నర్స్‌ని ఏర్పాటు చేశాడు. సాయంకాలం ఆఫీసు నుంచి తిరిగి రాగానే తనే ఒక నర్స్‌గా మారిపోతాడు భార్యకు. అతని కింకా యాభై నిండలేదు. ఒక్కోసారి ఈ జీవితం మీద విపరీతమైన విసుగు, విరక్తి కలుగుతుంటాయి పానకాలరావుకి. అటువంటి సమయాల్లో రెండు పెగ్గులు మాత్రం విస్కీ పుచ్చుకుని, టేప్ రికార్డర్ పెట్టుకుని పడుకుంటాడు అతను. ఇప్పుడా పనే చేశాడు.

టేప్ రికార్డరు మంద్ర స్థాయిలో రవిశంకర్ సితార్‌ని వినిపిస్తోంది. కాని పానకాలరావు మాత్రం వినే స్థాయిలో లేడిప్పుడు. వినోద నవ్వు, ఆమె నడక, అందమైన ఆ మాట తీరు, టైప్ మెషిన్ మీద పసిడి రేకుల వలె నాట్యం చేసే పలుచని ఆమె చేతి వేళ్లు - ఇవే కదులుతున్నాయి అతని కనుల ముందు.

"వినోదా! నా కెన్నేళ్లుంటాయో చెప్పగలవా?"

"చేతులకి పది, కాళ్లకి పది కలిపి ఇరవై ఉంటాయేమో!"

"గుడ్ జోక్! పోనీ నా వయ స్సెంతో చెప్పుకో చూద్దాం!"

"ఊఁ. మెడకి ఆ మఫ్లర్ తీసేస్తే నలభై, నలభై అయిదు మధ్య ఉంటుంది."

"వచ్చే డిసెంబర్‌కి యాభై వస్తుంది నాకు. ఒక మా టడుగుతాను. సూటిగా నీ అభిప్రాయం చెప్తావా?"

"తెలిస్తే తప్పకుండా చెప్తాను. అడగండి."

"నా భార్య రోగిష్టిది. ఎందుకూ పనికిరానిది. నేను మళ్లీ పెళ్లి చేసుకోవా లనుకుంటున్నాను. న్యాయమే నంటావా?"

"ఎందుకు కాదండీ! చురుగ్గా, ఆరోగ్యంగా ఉన్నారు. ఉన్నతమైన పదవిలో ఉన్నారు. మీ కేం తక్కువ? ఇంతకీ ఎలాంటి అమ్మాయిని చేసుకోవా లనుకుంటున్నారు?"

"అచ్చం నీలాంటి అమ్మాయినే, వినోదా!" అంటూ చటుక్కున ముందుకి వంగి ఆమె చేతిని సుతారంగా ముద్దు పెట్టుకున్నాడు. సిగ్గుపడిపోయి చిరునవ్వుతో తల వాల్చేసింది వినోద.

"అబ్బ! ఈ బెడ్ పాన్ తీసేయండి గుచ్చుకుంటోంది." మూలుగుతూ అన్న భార్య మాటలకు ఈ లోకంలోకి వచ్చి పడ్డాడు పానకాలరావు.

** ** **

**ఒక** ఆదివారం ఉదయం పాత థియేటర్లో ఆడే పాత సినిమా 'మల్లీశ్వరి'కి వెళ్లింది వినోద. హాస్టల్లో కొత్తగా పరిచయమైన శ్రీప్రియ కూడా వచ్చింది ఆమెతో. హాల్లో జనం చాలా తక్కువగా ఉన్నారు.

సినిమా మొదలైన పావుగంటకి ఒక జంట హాల్లోకి ప్రవేశించింది. ఒకరి మీద ఒకరు పడుతూ తూలుకుంటూ ముందు వరుసలోని సీట్లలో కూలబడ్డారు. ఇద్దరూ బాగా తాగి ఉన్నారు. సినిమా చూడటానికి రాలేదని వారి అసభ్యకరమైన శృంగార చేష్టలు స్పష్టం చేస్తున్నాయి.

ఇంటర్‌వెల్‌లో తన ముందు వరుసలోని ఆ స్త్రీని చూసిన వినోద నివ్వెరపోయింది. ఆమె ఎవరో కాదు - తన సెక్షన్‌లో పనిచేసే రోసీ!

"ఛీ! ఈ మధ్య మరీ బరితెగించినట్టుంది ఇది" అన్నది శ్రీప్రియ - హాల్లోంచి మధ్యలోనే వెళ్లిపోతున్న ఆ ఇద్దర్నీ చూసి.

"ఆమె నీకు తెలుసా?" అడిగింది వినోద ఆశ్చర్యంగా.

"తెలుసు. నువ్వు రాక ముందు కొన్నాళ్లు మన హాస్టల్లోనే ఉండేది - ఇంట్లో వాళ్లతో గొడవ పడి. రోజూ ఎవడో ఒకడు వచ్చేవాడు దీనికోసం. దీని ప్రవర్తన హద్దు మీరడంతో హాస్టల్లోంచి పంపించేశారు ఈ మహాతల్లిని. అస లిటువంటి వాళ్ల వల్లనే కొన్ని విమెన్స్ హాస్టళ్లకి చెడ్డపేరు." చెప్పింది శ్రీప్రియ.

ఆ మరునాటి రోజు ఆఫీసులో రోసీ పలకరించినా ఆమెతో సహజంగా మాట్లాడలేకపోయింది వినోద.

** ** **

**ఉగాది** సందర్భంగా ఆఫీసు స్టాఫంతా కలసి ఒక వినోద కార్యక్రమం ఏర్పాటు చేశారు. లలిత సంగీత కార్యక్రమంలో త్యాగరాజు నాలుగు భాషల్లో నాలుగు చక్కని పాటలు పాడి వినిపించాడు. అతను అంత బాగా పాడటం చూసి వినోదకు చాలా ఆశ్చర్యంతోపాటు ఆనందం కూడా కలిగింది.


చివరగా అందరూ వినోద కూడా ఒక పాట పాడాలని పట్టుబట్టారు. రోసీ అయితే ఆమెను బరబరా స్టేజి మీదకు లాక్కెళ్లినంత పని చేసింది.

మైకు ముందు నిలబడింది వినోద.

"మీ అభిమానానికీ, నా కంఠస్వరం మీద మీ కున్న నమ్మకానికీ హృదయపూర్వక ధన్యవాదాలు. నేను పాటలైతే రాయగలను కాని, పాడలేను. నేను రాసిన ఈ పాటని మన త్యాగరాజు గానం చేస్తే విని ఆనందించాలని మీ అందరి తరఫునా కోరుకుంటున్నాను" అని తన చేతిలోని పుస్తకంలో మడిచిపెట్టిన కాగితాన్ని బయటకు తీసింది వినోద. ఆమోదిస్తున్నట్టుగా అంతా చప్పట్లు చరిచారు. ఆమె చేతిలోంచి ఆ కాగితం అందుకున్న త్యాగరాజు మైకు ముందు కొచ్చి పాడసాగాడు.

"జీవితం చాలా విలువైనది. అందుకే నేమో ఈ జీవిత కాలం కూడా అతి స్వల్పమైనది. ఈ స్వల్పమైన కాల వ్యవధిలో మనం బాధపడకుండా, ఇతరులను బాధపెట్టకుండా బ్రతకగలగడం మన చేతుల్లోనే ఉంది. మితిమీరిన స్వార్థం, పగ, అసూయ, ద్వేషం, వర్ణ విభేదాలు అనేవి మనిషిని కలుషితం చేసి జీవితాన్ని దుఃఖమయం చేస్తున్నాయి.

"మనం పెద్ద పెద్ద త్యాగాలు చేయ నవసరం లేదు. స్నేహం, ప్రేమ, సౌహార్ద్రం, ఆర్ద్రత, అనురాగం అనే గుణాలను పెంచుకుంటే జీవించడంలోని మాధుర్యాన్ని ప్రతి మనిషీ ఆస్వాదించడానికి అవకాశం ఉంది. అప్పుడు ఈ జీవితం ఎంత అందమైనది అని తప్పక అనిపిస్తుంది" - ఈ అర్థం వచ్చే గీత రచన అది. ఆ పాటను భావ, రాగయుక్తంగా పాడి అందరినీ



మెప్పించాడు త్యాగరాజు. ఆ రోజు కార్యక్రమంలో వినోద, త్యాగరాజులు 'ది మేన్ అండ్ ది వుమెన్ ఆఫ్ ది ఫంక్షన్'గా ఎన్నికైనారు.

ఫంక్షన్ పూర్తయ్యాక, "రండి! మిమ్మల్ని కారులో డ్రాప్ చేస్తాను" అని త్యాగరాజు అన్నప్పుడు మరింత ఆశ్చర్యపోయింది వినోద.

"ఈ కారు ...?"

"నాది కాదు లెండి, మా నాన్నది" అంటూ డ్రైవింగ్ సీటులో కూర్చుని ఆమె కోసం తలుపు తెరిచాడు. కారు నడుపుతూ అతడు చెప్పిన మాటల్లోంచి అతన్ని గురించి కొంత తెలుసుకుంది వినోద.

త్యాగరాజు తండ్రి ఆ నగరంలో పేరు మోసిన ఒక పెద్ద ఇంజనీరింగ్ కాంట్రాక్టర్. కొడుకుని కూడా ఇంజనీరింగ్ చదివించి తనంతటి వాణ్ణి చేయాలని కలలు కన్నాడు. కాని త్యాగరాజుకు సంగీతం పిచ్చి పట్టుకుంది. హైస్కూలు చదువుకి స్వస్తి చెప్పి, అల్లా రఖా అనే ఒక హిందుస్తానీ విద్వాంసుడి దగ్గర శిష్యుడిగా చేరి, తబలా నేర్చుకున్నాడు. తండ్రి మీద ఆధారపడకూడ దని సొంతంగా బ్యాంక్‌లో ప్యూను ఉద్యోగం సంపాదించుకోగలిగాడు. తన పరువు తీయడానికే కొడు కిలా ప్రవర్తిస్తున్నాడని మండిపడేవాడు త్యాగరాజు తండ్రి. ఈ ఇద్దరి మధ్యా నలిగిపోయేది త్యాగరాజు తల్లి. ఆ పరిస్థితుల్లో వేరుగా ఉండటమే మంచి దనిపించి ఇల్లు వదిలి వచ్చేశాడు త్యాగరాజు.

"ఎప్పుడైనా నాన్న ఊళ్లో లేనప్పుడు ఒకసారి వెళ్లి అమ్మతో మాట్లాడి వస్తుంటాను. ఇప్పుడు కూడా ఆయనకు తెలియకుండా అమ్మనడిగి ఈ కారు తెచ్చాను ... మీ కోసం" అని ఒకసారి వెనక్కి తిరిగి ఆమెకేసి చూశాడు త్యాగరాజు.

"నా కోసమా! ఎందుకు?" అడిగింది వినోద విస్మయంగా.

"ఎందుకేమిటి? ఈ ఫంక్షన్ ముగిసేసరికి చాలా ఆలస్యమవుతుందని

తెలును. ఇప్పుడు ఈ దోవలో బస్సులు కూడా ఉండవు. టాక్సీలు దొరకడం కూడా కష్టమే. ఒంటరిగా మీరు ఇబ్బంది పడటం నా కిష్టం లేదు.'' ఆ మాట లంటున్నప్పుడు అతని గొంతులో ధ్వనించిన మార్పుని ఆమె గమనించకపోలేదు.

గంట పదిన్నర దాటింది. ట్రాఫిక్ పలచబడిన నగరపు వీధి విద్యుద్దీపాల కాంతిలో వింత సోయగంతో మెరుస్తూంది. గాలికి చెదిరే ముంగురులను కుడి చేతితో సవరించుకుంటూ, ''సినిమాల్లో అవకాశాల కోసం ప్రయత్నించలేదా?'' అని అడిగింది వినోద.


''తిరిగాను. ఎందరి చుట్టో తిరిగాను. వెళ్లిన ప్రతిచోటా అవమానమూ, అపహాస్యమే ఎదురయ్యాయి. సినిమాలకు నా గొంతు పనికిరా దన్నారు. 'లక్షణంగా మీ నాన్నగారితో చేరి కాంట్రాక్టు పనులు చేసుకుంటూ లక్షలార్జించక నీ కీ సినిమా పిచ్చెందుకు' అని సలహాలు కూడా ఇచ్చారు'' అని విరక్తిగా నవ్వాడు త్యాగరాజు.

విమెన్స్ హాస్టల్ ముందు కా రాగింది.

''చాలా థాంక్స్ త్యాగరాజు! వస్తాను, గుడ్ నైట్!'' అని కారు దిగింది వినోద.

** ** **

**ఒక** రోజు లంచ్ అవర్‌లో వినోద సీటు దగ్గరకు వచ్చింది రోసీ.




''రేపు నా బర్త్ డే. మా ఇంట్లో ఒక చిన్న పార్టీ ఉంది. చాలా క్లోజ్ ఫ్రెండ్స్‌ని మాత్రమే పిలుస్తున్నాను. ఆఫీసులో కూడా ఎవరికీ చెప్పలేదు. నిన్ను మాత్రం పిలవా లనిపించింది. నువ్వు తప్పకుండా రావాలి, వినోదా! రేపు సాయంత్రం ఏడు గంటలకి. మరిచిపోకు! ఇదుగో, మా ఇంటి అడ్రస్'' అంటూ ఒక కాగితం మీద అడ్రస్ రాసిచ్చింది.

అడ్రస్ చీటీ అందుకుంటూ ''ప్రయత్నిస్తాను'' అని మాత్రం అన్నది వినోద ముక్తసరిగా.

అంతగా పిలిచినప్పుడు వెళ్లకపోతే బావుండ దని పార్టీకి వెళ్లింది వినోద. రోసీ వాళ్లది చిన్న ఇల్లే. ఇంటి ముందున్న కాంపౌండ్‌లో పార్టీ ఏర్పాటైంది. దాదాపు యాభైమంది దాకా ఆడా, మగా హాజరైనారు. కొందరు కేకులూ, స్నాక్సూ తీసుకుంటున్నారు. కొంతమంది కూల్ డ్రింక్స్ చప్పరిస్తూ ఉంటే మరికొందరేమో హాట్ డ్రింక్స్ సేవిస్తున్నారు.

''హాయ్, వినోదా! వచ్చావా! రావేమో అనుకున్నాను'' అంటూ ఆప్యాయంగా ఆహ్వానించింది రోసీ. లోపలకు తీసుకెళ్లి తన వాళ్లని పరిచయం చేసింది. అమ్మ, నాన్న ఇద్దరు చెల్లెళ్లు, ఒక తమ్ముడు ఉన్నారు రోసీకి. తండ్రి రైల్వేలో ఇంజన్ డ్రైవర్‌గా ఉద్యోగం చేసి రిటైరైనాడు. పార్టీ జరుగుతూండగానే తప్పతాగి అతిథులతో చాలా అసభ్యంగా ప్రవర్తించాడు అతను. తాగు డెక్కువై చివర్న అందరి మధ్య భళ్లున వాంతి చేసుకున్నాడు కూడా.

అందరూ వెళ్లిపోయాక ఒక మూలగా ఉన్న కుర్చీలో కూలబడి అవమాన భారంతో లోలోపల సన్నగా విలపించసాగింది రోసీ. ఆ క్షణంలో ఆమెను చూస్తే జాలేసింది వినోదకి. దగ్గర కెళ్లి రోసీని సముదాయించే ప్రయత్నం చేసింది. కన్నీళ్లను తుడుచుకుని తన బాధని వినోద ముందు వెళ్లబోసుకుంది రోసీ.

''తన కొచ్చే పెన్షన్ డబ్బుల్లో ఒక్క పైసా కూడా ఇంటి కివ్వడు. అంతటితో ఊరుకున్నా పరవాలేదు. ప్రతి నెలా జీతం వచ్చేసరికి నన్ను జలగలా పీడించి డబ్బులు గుంజుతాడు. నా కొచ్చే జీతంలో సగం ఈయన తాగుడికీ, పేకాటకీ సరిపోతుంది. ఈ మనిషి బాధ తప్పించుకుందా మని కొంతకాలం హాస్టల్లో కూడా ఉండి చూశాను, వినోదా! అక్కడా నన్ను పీడించడం మానలేదు ఈ డెవిల్!''

ఏం చెప్పాలో అర్థం గాక మౌనంగా వింటూ కూర్చుంది వినోద.

''ఆ రోజు సినిమా హాల్లో నన్ను చూసి చాలా అసహ్యించుకుని ఉంటావు కదూ! నాకు తెలుసు. చూశావుగా, ఈ మనిషివల్లే మా ఇల్లో నరకంగా తయారైంది. ఈ నరకంలో జీవించే నేను మామూలుగా ఉండగలనా చెప్పు, వినోదా!'' అంటూ ఆమె చేతుల్ని తన ఒడిలోకి తీసుకుని బావురుమంది రోసీ.

** ** **

**మేనేజర్** గది ముందు 'డోంట్ డిస్టర్బ్' అనే బోర్డు వేలాడుతోంది. లోపల పానకాల రావు కెదురుగా వినోద కూర్చుని ఉంది.

''చెప్పండి, సార్! ఏదో ముఖ్యమైన ఫైల్ గురించి డిస్కస్ చేయాలన్నారు'' అడిగింది వినోద.

''ఫైలు కాదు. లైవు. ఫిలాసఫీ ఆఫ్ లైఫ్ గురించి చర్చించాలని పిలిచాను'' అన్నాడు మేనేజర్ పానకాలరావు నవ్వుతూ ఆమె కేసి చూసి.

''అంత పెద్ద విషయాల గురించి చర్చించేటంత ప్రత్యేకతగాని, శక్తిగాని నాకున్నాయని నేననుకోవటంలేదు, సార్!'' చురుగ్గా చూసి చెప్పింది.

''ఈ సార్, సార్ అనే మాటని వాడటం మానేయ్ వినోదా! సింపుల్‌గా రావ్ అనో, లేకపోతే 'రావు గారూ' అనో అనరాదూ? బ్రిటిష ఇంపీరియలిస్టులు మన నెత్తిన రుద్దేసిపోయారు ఈ 'సారు'ని, పరమ బోరుని.''

''అలాగే సార్!'' అని నాలుక కొరుక్కుంది వినోద. ''మంచిదండీ! మన స్టాఫ్ అందరికీ చెప్పేస్తాను. మేనేజర్ని 'రావ్' అని పిలవడం అలవాటు చేసుకోమని - రేపట్నుంచే.''

''చంపావ్! తెలివైన ఆడవాళ్లతో ఏది మాట్లాడినా పెద్ద చిక్కే!'' అని బిగ్గరగా నవ్వేశాడు పానకాలరావు.

''సరే, చెప్పండి. ఎందుకు పిలిచారు? టైపు చేయాల్సిన ఉత్తరాలు చాలా ఉండిపోయాయి నా సీట్లో.'' కుర్చీలో సర్దుకుని కూర్చుంటూ అన్నది వినోద.

''నా వ్యక్తిగత సమస్య ఒకటి నీతో చర్చించి, నీ సలహా తీసుకోవా లనుకుంటున్నాను.''

''మీకు నేను సలహా ఇవ్వడమా! ఏపాటి దా న్నని?'' నవ్వింది.

''అదిగో, మళ్లీ అదే మాట. కొంచెం సీరియస్‌గా, ఓపిగ్గా వినాలి, వినోదా, నువ్వు.'' అద్దం పరిచిన విశాలమైన ఆ టేబుల్ మీద మోచేతు లానించి కొంచెం ముందుకు వంగి అన్నాడు.

''ఊ, చెప్పం డయితే'' అంది. ఆమెలో ఆసక్తి కలిగింది. పేపర్ వెయిట్‌ని అద్దం మీద గిర్రున తిప్పి, దానికేసి చూస్తూ కొద్ది క్షణాలు మౌనంగా ఉండిపోయాడు.

''ఈ ఆఫీసులో నా పాతికేళ్ల సర్వీసులో ఎందరో అమ్మాయిలను చూశాను. అందమైన వాళ్లనీ, అందంగా మాట్లాడేవాళ్లనీ, తెలివైన వాళ్లనీ, ఆఫీసు పనిలో మహా చురుకైనవాళ్లనీ - కాని అందం, తెలివి, చురుకుదనం, నిజాయితీ, చక్కని మాట తీరు - అన్నిటినీ మించిన మంచితనం - ఇవన్నీ ఒకే మనిషిలో మూర్తీభవించడ మన్నది చాలా అరుదుగా సంభవిస్తూంటుంది. అలాంటి అరుదైన వ్యక్తివి నువ్వు, వినోదా!''

''ఇదేనా మీ సమస్య?'' నవ్వేస్తూ అడిగింది.

''ప్లీజ్, అడ్డు రాకు!'' అంతదాకా సరదాగా మాట్లాడుతూన్న అతని ముఖం కొంత గంభీరంగా మారిపోయింది.

''ఈ రోజు నీతో మనసు విప్పి మాట్లాడా లని ఉంది. నన్ను గురించి ను వ్వేమనుకున్నా సరే! అజంతా స్త్రీ మూర్తులలోని అందం నీలో ఉంది, వినోదా!''

ఈ మాట ఆమెకు కొంచెం ఇబ్బందిని కలిగించింది. అయినా సర్దుకుని నవ్వడానికి ప్రయత్నిస్తూ, ''అజంతా, ఎల్లోరా వెళ్లారా మీరు?'' అని అడిగింది.

''లేదు. కాని ఆ వర్ణ చిత్రాల రీప్రొడక్షన్స్ చూశాను.''

''మీ అభిమానం కొద్దీ అలా మాట్లాడుతున్నారేమో గాని, అతిశయోక్తులు మాత్రం చెప్పకండి దయచేసి.''

"కాదు. నీలో ఓ ప్రత్యేకమైన సౌందర్యం ఉంది. ఆ సంగతి నీకూ తెలుసు."

వినోద ఏం మాట్లాడలేదు.

పానకాలరావు కూడా కొద్ది క్షణాలు మౌనంగా ఉండిపోయాడు, ఏదో ఆలోచిస్తున్నవాడిలా.

"నేను మళ్ళీ పెళ్ళి చేసుకోవా లనుకుంటున్నాను, వినోదా!" అన్నాడు తలెత్తి ఆమె కేసి చూసి.

"రెండో పెళ్ళా! మరి మీ ఆవిడ?" నిర్ఘాంతపోయి అడిగింది.

"నా భార్య కొంతకాలంగా మంచంలో పడి ఉన్న సంగతి వినే ఉంటావు. అస లేం జబ్బో, ఎన్నాళ్ళు బతుకుతుందో ఏ డాక్టరూ కచ్చితంగా చెప్పలేకపోతున్నాడు" అని కొంచెం ఆగి, అడిగాడు - "అసలు నా కెన్నేళ్ళుంటాయని నీ ఊహ?"

పానకాలరావు కేసి ఒక్క క్షణం చూసి చెప్పింది వినోద -

"నలభై ఎనిమిదీ, యాభై ఉండొచ్చు."

"గుడ్! సరిగ్గా చెప్పావు. నలభై తొమ్మిది నిండాయి. పొత్తు కుదరని భార్యతో, తృప్తి కరమైన దాంపత్య జీవితంతో కొంత వయసు మళ్ళిన వాడిలా కనిపిస్తున్నా నేమో కదా, వినోదా! నిర్మొహమాటమైన నీ అభిప్రాయం కావాలి నాకు. యాభై ఏళ్ళ వయసులో పెళ్ళి చేసుకోవా లనుకోవడంలో అసహజ మేమైనా ఉంటుం దంటావా చెప్పు, వినోదా!"

ఆమె చిన్నగా నవ్వింది.

"ఛార్లీ చాప్లిన్ తెలుసా మీకు?"

"ఛాప్లిన్ సినిమాలు కొన్ని చూశాను."

"యాభైమూడేళ్ల వయసులో పందొమ్మిదేళ్ళ ఊనా ఓనీల్ అనే అందమైన అమ్మాయిని వివాహం చేసుకున్నాడు చాప్లిన్. విచిత్ర మేమిటంటే, అంతకు కొన్ని సంవత్సరాలకు ముందు అతను పెళ్ళి చేసుకున్న ఇద్దరు స్త్రీలతోనూ అతనికి పొంతన కుదరలేదు - తన వయసుకి తగినవాళ్లే అయినా. విడాకులు తీసుకుని వెళ్లిపోయారు వా ళ్లిద్దరూ. కాని భర్తకన్నా ముప్పై నాలుగు సంవత్సరాలు చిన్నదైన ఊనా చాప్లిన్‌తో హాయిగా సంసారం చేసి, అయిదారుమంది సంతానాన్ని కూడా కన్నది. చాప్లిన్ కంటే మీ వయసు తక్కువే కదా!"

"యు ఆర్ రియల్లీ గ్రేట్! నేను చాప్లిన్ సినిమాలు చూశాను. కాని ఆయన్ని గురించిన ఈ వింతైన విషయం ఎప్పుడూ వినలేదు" అని ఇంకా ఏదో అనబోయేలోగా టెలిఫోన్ మోగింది.

"వస్తానండీ! టైము ఐదు కావస్తోంది" అంటూ సీట్లోంచి లేచింది వినోద.

ఆమె తన సీటు దగ్గరకు నడుస్తూంటే స్టాఫంతా తనకేసి అ దో రకంగా చూడటం గమనించింది. "గురుడు వల విసురుతున్నట్టుందోయ్!" అనే కామెంట్ కూడా ఆమె చెవిన పడింది. అ దేమీ పట్టించుకోకుండా తన సీటు దగ్గరకు నడిచి హేండ్‌బేగ్ సర్దుకుంది వినోద.

** ** **

**మధ్యాహ్నం** రెండు గంట లైంది.

బ్యాంక్ మెయిన్ గేటు మూసేశారు. పక్క గేటు మాత్రం కొంచెంగా తెరిచి ఉంది. అప్పు డొచ్చా డతను. పల్లెటూరి వాలకం స్పష్టంగా కనిపిస్తోంది. సుమారు ముప్పై ఏళ్లుంటాయి అతనికి. చిన్న గేటులోంచి లోపలికి వెళ్లబోతుంటే సెక్యూరిటీ గార్డు అడ్డుకున్నాడు.

"టైమైపోయింది. కౌంటర్లు మూసేశారు. రేపు రా!" అన్నాడు గార్డు.

"డబ్బులు వేయడాని గ్గాని, తీయడాన్ని గాన్ని రాలేదబ్బా నేను. వినోద అని - మా ఊరి అమ్మాయి ఈ ఆఫీసులో పని చేస్తా ఉంది. చూసిపోతా మని వచ్చా!" చెప్పాడు.

వినోద పేరు వినగానే మ రేమీ మాట్లాడకుండా, "అయితే వెళ్లండి" అని లిఫ్ట్ కేసి దారి చూపించాడు సెక్యూరిటీ గార్డు.

లిఫ్ట్ వచ్చి ఆగింది. తనను అందులో ఎక్కించుకుంటారో, లేదో అని తటపటాయిస్తూండగానే లిఫ్ట్ తలుపులు మూసుకున్నాయి. ఉసూరు మంటూ మెట్లెక్కసాగాడు. ఇద్దరు ముగ్గుర్ని విచారించి వినోద పనిచేసే సెక్షన్ ఎక్కడో తెలుసుకున్నాడు. చేత ఒక పాతగుడ్డ సంచీతో హాల్లోంచి నడిచి వస్తున్న అతణ్ణి, 'ఎవ రీ పల్లెటూరి బైతు?' అన్నట్టు అతని కేసి వింతగా, ఎగతాళిగా చూస్తున్నారు కొందరు స్టాఫ్ మెంబర్లు.

అతని చూస్తూనే వినోద సీట్లోంచి లేచింది. "అరె! దాసూ, నువ్వా? ఎప్పు డొచ్చావ్? రా!" అంటూ సాదరంగా ఆహ్వానించింది. తన సీటు పక్కనే మరో కుర్చీ వేసి, "కూర్చో! ఊళ్లో అంతా బాగున్నారా?" అని కుశల ప్రశ్నలు ప్రారంభించింది.

ఆ పల్లెటూరి మనిషితో వినోద అంత సన్నిహితంగా కూర్చుని మాట్లాడుతూంటే సెక్షన్‌లో అంతా అ దో వింతగా చూస్తున్నారు.

"రామ చిలక, మొరటు కాకి ముచ్చట్లాడుతున్నాయి."

"కాదు. మల్లె తీగ, మొగలి రేకు ఊసులాడుకుంటున్నట్టుగా ఉంది" - ఈ వ్యాఖ్యానాలు వినిపించిన దిశ కేసి చురుగ్గా ఒక చూపు విసిరింది వినోద.

"రా, దాసూ! కాఫీ తీసుకుందాం" అని కేంటీన్‌కి తీసుకెళ్లింది అతన్ని.

"అయితే ఈ రోజే వెళ్లిపోతున్నావా ఊరికి?" అడిగింది కాఫీలు తాగడం అయ్యాక.

"అవును. సాయంకాలం బస్సుకి" అని సంచీలోంచి ఒక కాగితంపొట్లం



తీసి, వినోద చేతి కిచ్చాడు దాసు.

"ఏమిటిది?" అడిగింధి కుతూహలంగా.

"అరిసెలు. నీ కిష్టం కదా!"

"ఎక్కడివి?"

"రాజమ్మచేత చేయించి తెచ్చాను."

ఆఫీసు గేటుదాకా వచ్చి సాగనంపింది దాసుని వినోద.

** ** **

**సాయంత్రం** ఆరు గంటలు దాటింది.

అర్జెంట్‌గా హెడ్డాఫీసుకు పంపాల్సిన స్టేట్‌మెంట్‌లు ఉండిపోవటంతో ఓవర్‌టైం చేయాల్సి వచ్చింది వినోదకి. ఆమెకు తోడుగా ప్యూన్ త్యాగరాజు తప్ప డిపార్ట్‌మెంట్ అంతా ఖాళీగా ఉంది.

"కాఫీ తెమ్మంటారా?" అడిగాడు త్యాగరాజు దీక్షగా టైపు చేస్తున్న వినోదతో.

"అవసరం లేదు. అయిపోవచ్చింది. మరో అర్ధగంటలో ఇద్దరం బయలుదేరవచ్చు."

సరిగ్గా ఎదుగంటలకి టైప్ చేసిన కాగితాలను డ్రాయర్లో పెట్టి తాళం వేసి, సీట్లోంచి లేచింది వినోద. ఆఫీసు నుంచి బయటపడి ఇద్దరూ బస్‌స్టాప్ దాకా నడిచారు.

"నీకు నిజంగా సినిమాల్లో పాడాలని ఉందా,రాజూ?" అడిగింది బస్‌స్టాప్‌లో నిల్చుని వినోద.

సమాధానం చెప్పకుండా మౌనంగా ఉండిపోయాడు త్యాగరాజు.

"చెప్పు, సినిమాల్లో పాడాలనే ఉత్సాహం ఇంకా నీలో ఉందా?"

"ఒకప్పుడు ఉండేది. ఇప్పుడు కాదు."

"ఎందుకని?"

"చెప్పాను కదా ఇదివరకే మీతో. అవకాశాలకోసం ఎందరి కాళ్లో పట్టుకున్నాను. అవమానాలే తప్ప, అవకాశాలు. రాలేదు: ఆశలు వదులుకున్నాను."

"ఆశలు వదులుకుని తాగడం నేర్చుకున్నావ్ - దేవదాసులా. అవునా?" చిన్నగా నవ్వుతూనే మందలింపుగా అన్నది వినోద. అంతలో ఆమె ఎక్కాల్సిన బస్సు వచ్చి ఆగింది.


"మీ బ స్సొచ్చింది." చెప్పాడు త్యాగరాజు.

"పరవాలేదు. తరువాతి బస్సులో వెళ్తానులే! రాజూ! నీకు సినిమాల్లో పాడే అవకాశం నేను కల్పిస్తాను. అయితే ఒక షరతు."

'ఏమి టది' అన్నట్టు ఆశ్చర్యంగా చూశాడు త్యాగరాజు.

"నువ్వు తాగడం మానేయాలి." అతని కళ్లలోకి సూటిగా చూసి చెప్పింది.

"కష్టం. చాలా కష్టం! నాకు సాధ్యం కాని కోరిక కోరుతున్నారు మీరు!" కొద్ది క్షణా లాగి అన్నాడు త్యాగరాజు.




"మనిషి తలుచుకుంటే సాధ్యం కాని దేదీ లేదు, రాజూ! అసలు ప్రయత్నం చేయకుండానే కష్టం కష్టం అని మనమే తీర్మానించేసుకుని చేతులు ముడుచుకు కూర్చోవడం వల్లే మన కలా అనిపిస్తుంది గాని, చేయాలనుకుంటే ఏ పనీ నిజంగా కష్టం కాదు. నీ కొక మ్యూజిక్ డైరెక్టర్‌ని పరిచయం చేస్తాను. అతను నీకు అవకాశం ఇవ్వగల డనే నమ్మకం నాకుంది. నువ్వు మాత్రం తాగుడు మానేయాలి. చెప్పు, మానుతావా?"

"ప్రయత్నిస్తాను."

"అలా అంటే కుదరదు. ఈ క్షణం నుంచి నువ్వు మద్యం అనే మాటను మరిచిపోవాలి. ఈ రోజు సోమవారం కదూ! సెలవు పెట్టకుండా ఈ వార మంతా నువ్వు ఆఫీసుకు రావాలి. రోజూ సాయంత్రం ఎనిమిది దాటాక హాస్టల్‌కి ఫోన్ చేసి నాతో మూడు నిముషాలు మాట్లాడాలి. ఆదివారం సాయంత్రం హాస్టల్‌కి వచ్చి నా కోసారి కనిపించి వెళ్లాలి. ఏం?"

ఈ చివరి ప్రతిపాదనకు విస్తుపోయాడు త్యాగరాజు.

"ఎందుకండీ?" సంకోచిస్తూ అడిగాడు.

"నువ్వు తాగడంలే దని నేను నిర్ధారించుకోవాలిగా మరి!" నవ్వుతూ చెప్పింది వినోద. "ఏం, ఈ వారం రోజులూ సీసా జోలికి పోకుండా ఉంటావు కదూ!"

ఉంటా నని అనలేకపోయాడు.

"రాజూ! నువ్వు దేవుడ్ని నమ్ముతావా?"

మౌనం వహించాడు.

"పోనీ నా మీద నమ్మకం ఉందా?"

ఉం దన్నట్టుగా త లూపాడు.

"ఇక నుంచి మద్యం ముట్టుకో నని నా మీద ఒట్టేసుకో!"

** ** **

అనుకున్న ప్రకారం ఆదివారం సాయంత్రం హాస్టల్ కొచ్చి వినోదని కలుసుకున్నాడు త్యాగరాజు.

"కంగ్రాట్యులేషన్స్! మాటను నిలబెట్టుకున్నావు" అంటూ అతన్ని అభినందించింది ఆమె.

"ఎలా తెలుసుకున్నారు నే నీ వారం రోజులూ తాగలేదని?" ఆశ్చర్యంగా అడిగాడు.

"నీ ముఖంలోని ఆ కళ, ఇంతకు మునుపు నీ కనులలో ఎన్నడూ కనిపించని ఆ కాంతి - వీటిని చూస్తే తెలియడంలేదూ!" అని, "మ్యూజిక్ అకాడెమీలో ఇవాళ ఎస్.పి. బాలు, ఎస్. జానకిల సంగీత విభావరి ఉంది. రెండు కాంప్లిమెంటరీ టిక్కెట్లు వచ్చాయి నాకు. తో డెవరూ లేరు. వెళ్దాం, వస్తావా?" అడిగింది.

అతను తటపటాయించడం గమనించి, "ఏమి టాలోచిస్తున్నావు? ఇం కేదైనా ప్రోగ్రాం ఉందా నీకు?" అంది.

"అది కాదండీ! మన ఆఫీసు వా ళ్లెవరైనా చూస్తే ..."

"ఊఁ, చూస్తే? లేనిపోని కథ లల్లుతా రు మనల్ని గురించి. అంతేనా? నే ననాల్సిన మాటల్ని నువ్వు అంటున్నావా, రాజూ! నే నిలాంటివాటికి భయపడేదాన్ని కాదు. కమాన్! టై మైపోతోంది" అని ఆటోను పిలిచింది వినోద.

ముందు వరుసలోని సీట్లో వినోద, త్యాగరాజు పక్కపక్కనే కూర్చున్నారు. ఇంటర్‌వెల్‌లో మ్యూజికల్ నైట్‌కి వచ్చిన ఒక వ్యక్తికి త్యాగరాజుని పరిచయం చేసింది వినోద.

చిత్రసీమలో అప్పుడప్పుడే పై కొస్తున్న సంగీత దర్శకు డాయన. ఆయన సంగీతం వహించిన రెండు సినిమాలు అప్పటికే హిట్టయినాయి. ఆయన వినోదకు ఒక రకంగా దూరపు చుట్టం అవుతా డు. "బాబాయ్!" అంటూ సంబోధిస్తూ మాట్లాడింది అతనితో వినోద. త్యాగరాజుతో మూడు నిముషాలు మాట్లాడి, తన విజిటింగ్ కా ర్డిచ్చి వారం రోజుల తరువాత ఫలానా రికార్డింగ్ థియేటర్‌లో తనను కలుసుకోమని చెప్పాడు ఆ మ్యూజిక్ డైరెక్టర్. ఆనందంతోనూ, ఆశ్చర్యంతోనూ మిలమిల మెరిశాయి త్యాగరాజు నేత్రాలు. కృతజ్ఞతని నింపుకుని ఆరాధనతో వినోద కేసి చూస్తూండిపోయాడు అతను.

** ** **

భార్యకి సీరియస్‌గా ఉందని పదిరోజులు సెలవు పెట్టాడు పానకాలరావు. ఒక శనివారం సాయంత్రం వేరే పని మీద అటు వైపుగా వెళ్లిన వినోద పానకాలరావు ఇంటికి వెళ్లింది పరామర్శించడానికి. ఆమె రాక అతనికి అమితోత్సాహాన్ని కలిగించింది.

పానకాలరావు భార్య మంచం మీద పక్కకి తిరిగి పడుకుని నిద్రపోతోంది. ఊపిరి భారంగా పీలుస్తోంది. ఆమెను చూస్తుంటే వినోదకి జాలనిపించింది.

"విశాలాక్షీ! విశాలాక్షీ!" అంటూ భార్యను లేపబోయాడు పానకాలరావు. వద్దని వారించింది వినోద.

"ఇంతకు ముందే విపరీతమైన నొప్పితో బాధపడుతూంటే రెండు నిద్రమాత్ర లిచ్చి పడుకోబెట్టాను" అన్నాడు పానకాలరావు భార్య కేసి చూస్తూ.

ఫ్రిజ్ తెరిచి పళ్ల రసం కలిపి, ఐస్ ముక్కలు వేసి వినోదకు ఒక గ్లాసిచ్చి, త నొకటి తీసుకున్నాడు. ఉన్నట్టుండి ఏదో ఉద్వేగం కమ్మేసింది అతన్ని. సగం తాగిన పళ్లరసం గ్లాసుని టేబుల్ మీద పెట్టి చటుక్కున వినోద రెండు చేతులూ పట్టుకున్నాడు.

"నాకూ అందరిలా సుఖపడాలని ఉంది. ఐ వాంటు లివ్! కాని.... కాని ... నా బాధ నీ కర్థమవుతోందా? చెప్పు, వినోదా! నన్ను అర్థం చేసుకోగలవా?" అతని కంఠం గాద్గదికంగా మారింది.

ఈ హఠాత్ చర్యకి నిర్ఘాంతపోయింది ఆమె. అతని పట్టు నుంచి తన చేతుల్ని విడిపించుకోవాలని కూడా అనిపించలేదు ఆమెకి ఆ క్షణంలో. అతని పట్ల ఆమెలో పొంగిన సానుభూతి ఆమెను కట్టిపడేసింది.

ఆవేశం తగ్గి, దూరంగా జరిగి - "సారీ!" అన్నాడు పానకాలరావు.

"ఈ పరిస్థితిలో మీ రిలా తొందరపడటం మంచిది కాదు, రావు గారూ!

కొన్నా ళ్లాగండి" అని మాత్రం అనగలిగింది వినోద.

"వస్తాను. ఆలస్యమైపోయింది" అని సెలవు తీసుకుంది.

మొదటిసారిగా ఆమె తనను 'రావు గారూ' అని సంబోధించడం తలుచుకుని గుండెల్లో గిలిగింత పెట్టినట్లై తృప్తిగా నిట్టూర్చాడు పానకాలరావు.

రాత్రి పన్నెండు గంటలైంది.

పానకాలరావు ఆలోచిస్తున్నాడు. వినోదను వివాహం చేసుకోవా లనుకుంటే భార్యకు విడాకు లివ్వాలి. కాని అది సాధ్యమా? మంచాన పడి లేవలేని పరిస్థితిలో ఉన్న భార్యను వదిలేస్తే అంతా ఏమనుకుంటారు? తన నొక రాక్షసుడి కింద చూస్తారు. ముఖ్యంగా వినోద హర్షించదు. ఆమెకు తనంటే ఉండే సద్భావం మంటగలిసిపోతుంది.

మరో మార్గం లేదా?

ఉంది. తన భార్య మరణించడం! ఎప్పుడు? 'పాపీ చిరాయుః' అన్న సామెతగా ఈ దీర్ఘ రోగిష్టి మనిషి ఇంకా ఎంతకాలం బతికి ఉంటుందో ఎవరు చెప్పగలరు? తను చెప్పలేడా? ఆ ఆలోచన కలగ్గానే కొద్ది క్షణాలు దీర్ఘంగా ఆలోచించాడు పానకాలరావు. తను తలచుకుంటే రేపే ఆమె బాధకీ, తన బాధకీ విముక్తి కలిగించుకోగలడు. అతను లేచాడు. అల్మైరా దగ్గరకు నడిచి నిద్ర మాత్రల సీసా చేతికి తీసుకున్నాడు.

'మరీ బాధగా ఉంటే మాత్రం రెండు మాత్రలు ... రెండంటే రెండే ... మింగించి పడుకోబెట్టండి' - డాక్టరు చెప్పిన మాటలు గుర్తు చేసుకున్నాడు. సీసా మీది లేబిల్ చదివాడు - 'హెచ్చరిక : మూడు మాత్రలకన్నా ఎక్కువ మింగితే ప్రాణాపాయం' అని ఎర్రని అక్షరాలతో రాసి ఉంది. అయిదారు మాత్రల్ని అరచేతిలో పోసుకుని, వంట గదిలోకి నడిచాడు. మెత్తగా పొడి చేసి గ్లూకోజ్ నీళ్ళలో కలిపి ఆ గ్లాసుని తెచ్చి టేబుల్ మీద పెట్టాడు.

మ్యూజికల్ క్లాక్ మృదువుగా ఒంటి గంట వినిపించింది.

విశాలాక్షి మూలుగుతూ మంచం మీద ఇటువక్కకి తిరిగింది.

నీరసంగా కళ్లు తెరిచి భర్త కేసి చూసింది. "దాహంగా ఉంది, కాసిని మంచినీ ళ్లిస్తారా?" అంది.

"గ్లూకోజ్ కలిపి ఉంచాను. తాగుతావా?" అడిగాడు.

"ఊఁ." మూలిగింది ఆవిడ.

గ్లాసు అందిస్తున్న అతని చేయి వణికింది. ద్రవం చింది రెండు మూడు బొట్లు పడక మీద పడ్డాయి. పానకాలరావు నుదుటి మీద స్వేద బిందువులు పొటమరిస్తున్నాయి. గ్లా సందుకుంటూ భర్త ముఖంలోకి చూసింది విశాలాక్షి.

"ఏమి టలా ఉన్నారు? మీ చెయ్యి వణుకుతోం దేమిటి?"

"ఆఁ!" ఉలిక్కిపడ్డాడు. "ఏం లేదు. కొంచెం జ్వరం వచ్చినట్టుగా ఉంది."

చిన్నగా నవ్వింది ఆమె. చాలా రోజుల తరువాత శుష్కించిన ఆమె అధరాల మీద పుష్పించిన చిరు దరహాసం అది.

'నా బాధకి శాశ్వత విముక్తిని ప్రసాదిస్తున్నారా?' అని ప్రశ్నిస్తున్నట్టుగా అనిపించింది పానకాలరావుకి ఆ నవ్వు.

అతని గుండె లోతుల్లో ఏదో కదిలి మెలివేసింది.

చటుక్కున విసురుగా ఆమె చేతిలోంచి గ్లాసు లాగేశాడు.

"ఏమైంది?" అడిగిం దామె బిత్తరపోయి.

"గ్లాసులో ఏదో పురుగు పడినట్టుంది. పారబోసేసి వేరే నీళ్లు తెస్తా నుండు" అని వంట గదిలోకి నడిచాడు. వాష్ బేసిన్‌లో ముఖం మీద నీళ్లు చల్లుకున్నాడు. కాచి, చల్లార్చిన నీళ్ల గ్లాసు తెచ్చి భార్య చేతి కిచ్చాడు. తృప్తిగా ఊపిరి పీల్చుకుని పడక మీద వాలి కళ్లు మూసుకున్నాడు.

సరిగ్గా వారం రోజుల తర్వాత నిద్రలోనే చివరి శ్వాస వదిలింది విశాలాక్షి.

** ** **

**ఒక** సాయంత్రం ఖాదీ భవన్‌లో రవికుమార్ ఎదురుపడ్డాడు వినోదకి.

"అరె! ఇ దేమిటి మీ రిక్కడ?" అడిగాడు ఆమెను చూసి.

"ఎందు కలా ఆశ్చర్యపోతారు. ఏం, నాకు బట్ట లవసరం లే దనుకున్నారా ఏమిటి?" అని చిలిపిగా నవ్వింది ఆమె. ఆ చనువుకి చకితుడయ్యా డతను.

"ఎంపిక పూర్తయిందా?"

"లేదు. ఇప్పుడే వచ్చాను" అంటూ పంచెలు, చొక్కాలు ఉండే విభాగంలోకి దారి తీసింది. ఆమె ననుసరించాడు రవి.

"మీరు కొనడం అయిపోయిందా?" అడిగింది.

"మహాత్మా గాంధీ 'ఏన్ ఆటోబయాగ్రఫీ' కొందామని వచ్చాను. కాపీ లైపోయినాయి, వారం రోజుల తరువాత రమ్మన్నారు."

"మార్క్సిస్టులు మహాత్మా గాంధీని చదవడమా?" నవ్వుతూ అంది.

"గాంధీని ఎక్కువగా చదివింది మార్క్సిస్టులే నని నా అభిప్రాయం. మంచి పుస్తకం ఏదైనా సరే చదవడం అలవాటు నాకు."

రెండు ఖద్దరు పంచెలు, రెండు పొట్టి చేతుల ఖద్దరు చొక్కాలు తీసుకుంది వినోద. బిల్లు చెల్లించి బయటకు వస్తున్నప్పుడు అడిగాడు రవి - "మీ నాన్నగారికా ఇవి?"

"కాదు. మామయ్యకి. రేపు ఆయన పుట్టినరోజు."

"మంచి కలర్ పాంటు, దాని మీదికి ఖరీదైన సిల్కు జుబ్బా లాంటి దేదైనా కొనొచ్చుగా. పైగా పుట్టిన రో జంటున్నారు?"


"లేదండీ. ఆయన కిలాంటివే ఇష్టం. అ దొరకం పాతకాలం మనిషిలెండి!" నవ్వి చెప్పింది.

కాసేపాగి అడిగాడు రవి - "వినోదగారూ! మీతో కొంచెం మాట్లాడాలి. కాసేపు అలా పార్కులో కూర్చుందాం, వస్తారా?"

"పదండి" అం దామె.

పేరు తెలియని పూల చెట్ల కింద పచ్చికలో కూర్చున్నా రిద్దరూ.

"మేనేజర్ పానకాలరావు విషయంలో మీరు కొంచెం జాగ్రత్తగా ఉండాలి" అన్నాడు ఉపోద్ఘాతంలా. "మీరు అనుకుంటున్నంత మంచివాడు కాదు అతను."




"ఈ విషయం ప్రత్యేకంగా నాతో చెప్పాల్సిన అవసరం ఏమిటో తెలుసుకోవచ్చా?"

"మాటిమాటికీ మిమ్మల్ని తన కేబిన్‌లోకి పిలిపించుకోవడం, మీ రతనింటికి వెళ్లిరావడం - ఇదంతా గమనించడంలే దనుకోకండి." అత నింకా చెప్పబోయేటంతలో - "చూడండి, రవి గారూ! నే నేం చిన్నపిల్లని కాదు. గార్డియన్‌లా నా కెవరూ సలహా లివ్వడం నాకు బాగుండదు" అన్నది వినోద కొంచెం కోపంగా. "నాకు మీ రెంతో, మేనేజర్ కూడా అంతే!" అని కూడా కలిపింది కోపాన్ని అదిమిపెట్టి సౌమ్యంగా ధ్వనించే ప్రయత్నం చేస్తూ.

"మీరు జూనియర్ ఆఫీసర్ పరీక్షలకి వెడుతున్నారు కదూ?" అడిగాడు.

'అవును. ఏం?' అన్నట్టుగా చూసింది వినోద.

"ఇంతవరకూ ఎవరికీ ఇవ్వనంత 'ఎక్సలెంట్' రిపోర్టు పంపాడు మిమ్మల్ని సిఫార్సు చేస్తూ ఈ పానకాలరావు ఎందు కంటారూ?"

ఈసారి నిజంగానే మండిపడింది వినోద - "అది ఆయన్నే అడిగి తెలుసుకోవచ్చుగా?"

"చూడండి, వినోద గారూ! మీ రీ ఆఫీసుకి కొత్త. ఈ రాజకీయాలు మీ కర్థం కావడం కష్టం" అని కాసేపాగి చెప్పాడు.

"పానకాలరావు ఒక శాడిస్టు. రాత్రులు భార్యని నానాహింసలూ పెట్టేవాడు. మానసికంగా, శారీరకంగా ఆమె ఆరోగ్యం క్షీణించడానికి అతడే

[తరువాయి 26వ పేజీలో]

[25వ పేజీ తరువాయి]

కారణం. మీ కింకో సంగతి తెలుసా? పానకాలరావు భార్య సహజంగా చనిపోలేదు. భర్తచేత చంపబడింది! శవానికి పోస్టుమార్టం జరక్కుండానే ఇన్‌స్పెక్టర్‌కి లంచం పోసి తప్పించుకున్నాడు ఈ పానకాలరావు."

విశాలాక్షి మరణించిన రోజుని గుర్తు తెచ్చుకుంది వినోద.

ఆనాడు ఆమె అక్కడే ఉంది. అందరూ వెళ్లిపోయాక వినోదను మాత్రం కాసేపాగి వెళ్లమని బతిమాలాడు పానకాలరావు.

ఆ పరిస్థితిలో కా దనలేకపోయింది వినోద.

"ఆఫీసుకి మేనేజర్ నవటం నా నేరమా చెప్పు, వినోదా! నా భార్య చావుకి నేనే కారణమనీ, విషం పెట్టి చంపానని పోలీస్ స్టేషన్‌కి మన ఆఫీసు నుంచి ఫోన్ల మీద ఫోన్లు చేశారు. ఇన్‌స్పెక్టర్ నాకు బాల్య స్నేహితుడు గనుక సరిపోయింది. ఏ గొడవా జరగలేదు. మనస్ఫూర్తిగా చెప్పు, వినోదా! నే నంత రాక్షసుడిలా కనిపిస్తున్నానా అందరికీ? ఎందుకు ... ఎందుకు వీ ళ్లంతా న న్నిలా?" అతనికి దుఃఖంతో గొంతు పూడుకుపోయింది.

"రాక్షసుడుగా మారి ఉండేవాడినే - వారం రోజుల కిందట నువ్వు విశాలాక్షిని చూసిపోవటానికి వచ్చిన ఆ రోజు. కాని ఏ అదృశ్య శక్తో చివరి క్షణాన నన్ను మనిషిని చేసింది. వివేకం నశించిన ఆ క్షణికావేశంలో నేను తలపెట్టబోయిన ఆ పాపమే ఇప్పుడు న న్నిలా వేధిస్తున్నదేమో" అని వారం రోజుల కిందట ఒక అర్ధరాత్రి నిద్ర మాత్రలు కలిపి భార్యను చంపడానికి




ప్రయత్నించడం, వెంటనే ఆ గ్లాసును తనే లాక్కుని పారబోయడం గురించి వినోదతో చెప్పుకుని వేదన పడ్డాడు. రెండు చేతుల్లోనూ ముఖం దాచుకుని పసిపిల్లాడిలా వెక్కి వెక్కి ఏడ్చాడు పానకాలరావు.

"ఏమి టాలోచిస్తున్నారు? ఇప్పటికైనా నమ్ముతా రా అత నెటువంటి రాక్షసుడో?" అన్నాడు రవి.

"నమ్మను!" దృఢంగా పలికింది వినోద.

ఆ తరువాత ఏ మనాలో వెంటనే తోచలేదు రవికుమార్‌కి. కాసేపాగి అన్నాడు - "మెరిట్ లిస్టులో మీకు ప్రమోషన్ కావాలంటే నాతో చెప్పండి, మీరు సెలక్టయ్యేటట్లు నేను చూస్తాను. అంతే గాని ..."

"న న్నర్థం చేసుకోకుండా మాట్లాడుతున్నారు. ఆఫీసర్ని అవ్వాలని నే నేమీ వెంపర్లాడటంలేదు. నా కెవరి సిఫారసులూ అక్కర్లేదు. మేనేజర్ నన్ను సిఫార్సు చేసిన విషయం కూడా మీరు చెప్పేదాకా నాకు తెలియదంటే నమ్ముతా రా మీరు? అసలు నా గురించి మీ కేం తెలుసని? ఒక్క మా టడుగుతాను, నిజం చెప్పండి. పానకాలరా వంటే ఎందుకు మీ కింత ద్వేషం?"

"పదేళ్లకి పైగా సర్వీసున్న ఒక సీనియర్ స్టాఫ్‌ని డిస్మిస్ చేసి పుణ్యం కట్టుకున్న మహానుభావుడు గనుక!" కసిగా అన్నాడు రవి.

"అలాగా! నెల్లో ఇరవై రోజులు గైర్హాజరయ్యే ఉద్యోగిని ఎంతకాలమని భరిస్తుంది, రవిగారూ, ఏ ఆఫీసైనా? ఆ ఉద్యోగి మీకు దగ్గరి చుట్టం కూడా కదూ!"

దిమ్మెరపోయి చూశాడు రవి ఆమెకేసి.

"క్షమించండి.. నాకు సంబంధం లేని విషయా లవి. వాదంలోకి దింపారు గనుక అనాల్సి వచ్చింది. పానకాలరావుకి నాతో మాట్లాడటం ఇష్టం. ఒక సాంత్వన అతనికి. అది అభిమానమే కావచ్చు, అప్యాయతే కావచ్చు, ఇం కేదైనా కావచ్చు. అందులో నా కెటువంటి అపకారమూ కనిపించనప్పుడు ఆయనతో కాసేపు మాట్లాడటంలో నష్ట మేమిటో నా కర్థం కావడంలేదు. ఇప్పుడు మీరు షాపులో కనిపించారు. మాట్లాడదాం పార్కుకి రమ్మని పిలిచారు. వచ్చాను. అదీ అంతే! కాదంటారా?"

"సహోద్యోగితో స్నేహంగా ఉండటం, మేనేజ్‌మెంట్‌తో మైత్రి కలపడం - రెండూ ఒకటి కాదు, వినోదగారూ!"

"ఓహో! అర్థమైందిలెండి! వర్కింగ్ క్లాసు, యాజమాన్యం విభిన్న వర్గాలు కదూ? నా కీ వర్గ విభేదాలూ, వర్గ పోరాటాలూ - వీటిమీద అంత నమ్మకం లేదండీ, రవికుమార్ గారూ!" అంటూ నవ్వేసింది వినోద.

"కాని నా కింకా నమ్మకం పోలేదండీ, వినోదాదేవి గారూ!" అని తనూ నవ్వాడు రవి.

"రష్యాలో, చైనాలో ఇప్పుడు జరుగుతున్న మార్పులు చూశాక కూడానా?" ప్రశ్నించింది వినోద.

"అందుకు చాలా కారణా లున్నాయిలెండి. వర్గరహిత సమాజం ఏర్పడేదాకా సమాజంలో వర్గాలూ, వర్గ పోరాటాలూ తప్పవు. కాకుంటే దోపిడీ విధానం మారొచ్చు. దా న్ననుసరించి వర్గ పోరాటాల పద్ధతుల్లోనూ మార్పులు రావచ్చు."

"బాబోయ్! మార్క్సిస్టు ఫిలాసఫీ మీద క్లాసు తీసుకునేటట్టున్నారు. ఇంకోరోజు తీరిగ్గా వచ్చి కూర్చుంటాను గాని, చీకటి పడింది. లేవండి, వెళ్దాం!" అని పైకి లేచి, చీర కంటిన గడ్డిపరకలని విదిలించికుంది వినోద.

తన బైక్ మీద హాస్టల్ దగ్గర దిగబెట్టాడు రవి ఆమెని.

** ** **

'కాన్ఫిడెన్షియల్' డి.ఓ. లెటర్ టైప్ చేయడానికి రోసీని తన కేబిన్‌లోకి పిలిచాడు పానకాలరావు. లోపలికి అడుగు పెడుతూ కొంచెంగా తూలి ముందుకి పడబోతూ నిలదొక్కుకుంది రోసీ. డిక్టేషన్ తీసుకుని లెటర్ టైప్ చేసింది. సంతకం కోసం పానకాలరావు ముందుంచింది లెటర్‌ని. ఉత్తరం చివర్న 'యువర్ సిన్సియర్లీ' అని ఉండాల్సిన చోట 'టు సర్ విత్ లవ్' అని టైపు చేసి ఉండటం చూసి నిర్ఘాంతపోయాడు.

"ఏమి టీ నాన్సెన్స్!" అని కొరకొర చూశాడు రోసీని.

"ఏమైంది, సర్?" అంటూ అతని పక్కకొచ్చి భుజాల కానుకుని, నుంచుని వంగి ఉత్తరంలోకి తొంగి చూసింది రోసీ.

బ్రాందీ వాసన గుప్పు మని తగిలేసరికి ముఖం పక్కకి తిప్పుకుని, "తా గొచ్చావా?" అని అరిచాడు మేనేజర్ పానకాలరావు.

"రాత్రంతా నిద్ర లేదు సార్! కళ్లు మంటలుగా ఉంటే కొంచెంగా బీరు మాత్రం పుచ్చుకున్నా, అంతే!" అంటూ వయ్యారంగా ఒళ్లు విరుచుకుంది ఆమె.

కోపంతో ఉగ్రుడైపోయాడు మేనేజర్.

"గెటవుట్ ఆఫ్ హియర్!" అని అరుస్తూ ఆమె షార్ట్‌హేండ్ నోట్‌బుక్‌ని విసిరికొట్టాడు పానకాలరావు.

జేవురించిన ముఖంతో కళ్లు తుడుచుకుంటూ సీట్లో కొచ్చి టేబుల్ మీద వాలిపోయి, రెండు చేతుల్లోనూ ముఖం దాచుకుంది. స్టాఫంతా "ఏమైంది ... ఏమైంది?" అంటూ ఆమెను చుట్టేశారు. వెక్కిళ్ల మధ్య అస్పష్టంగా ఏదో గొణిగింది రోసీ! చుట్టూ మూగిన వాళ్లు రకరకాలుగా అర్థం చేసుకున్నారు. అప్పటికప్పుడు తలా తోకా జోడించి ఒక ఆకృతిని కల్పించారు. వినోద ఆరోజు ఆఫీసుకు రాలేదు.

ఆ మధ్యాహ్నమే లంచ్ అవర్‌లో స్టాఫ్ యూనియన్ గదిలో అత్యవసర రహస్య సమావేశం జరిగింది. ఒక లేడీ స్టాఫ్‌తో అసభ్యంగా ప్రవర్తించి అత్యాచారం చేయబోయిన మేనేజర్ మీద తగిన విధంగా చర్య తీసుకోవాలనే తీర్మానాన్ని యూనియన్ కార్యవర్గ సమావేశం ఏకగ్రీవంగా ఆమోదించింది.

ఆ మరునాటి రోజు ఉదయం పది గంటలు -

ఆఫీసు ముందు వందమందికి పైగా గుమికూడి ఉన్నారు ఆఫీసు సిబ్బంది. అందరి చేతుల్లోనూ మేనేజర్‌ని ఖండిస్తూ రాసిన నినాదాల అట్ట లున్నాయి. మెట్ల మీద మెయిన్ గేటు ముందు నిలబడి వీరావేశంతో నినాదా లిస్తున్నాడు యూనియన్ లీడర్ రవి కుమార్.

"మేనేజర్ పానకాలరావ్!"

"డౌన్! డౌన్!" గొంతు కలుపుతున్నారు చుట్టూ మూగిన మిత్ర

బృందం.

"మేనేజర్ నిరంకుశత్వాన్ని"

"సహించం! సహించం!"

"లేడీ స్టాఫ్‌తో అసభ్యంగా ప్రవర్తించిన మేనేజర్‌ని"

"డిస్మిస్ చేయాలి! డిస్మిస్ చేయాలి!"

"జిందాబాద్ జిందాబాద్!"

"స్టాఫ్ యూనియన్ జిందాబాద్!"

అలా మొదలైన సమ్మె వారం రోజులు దాటినా పరిష్కారం కాలేదు. క్రమంగా ఉద్యోగుల్లో పట్టుదల సడలడం ప్రారంభమైంది. కొంతమంది యూనియన్ కార్యకర్తల నెదిరించి ఆఫీసుకు హాజరు కావడం మొదలుపెట్టారు. యాజమాన్యం ఏ మాత్రం దిగివచ్చే సూచనలు కనిపించలేదు. 'ఎన్ని రోజులు సమ్మె చేస్తారో చేసుకోండి. మా దేంపోయింది' అన్నట్టుగా ఊరుకున్నారు.

పానకాలరావును సస్పెండ్ చేయాలనే డిమాండ్ నుంచి కొంచెం కొంచెంగా దిగి వచ్చింది యూనియన్.

ఆ రోజు సాయంత్రం రవికుమార్ గదిలో యూనియన్ కార్యకర్తల సమావేశం ఏర్పాటైంది. వాళ్ల మధ్య వినోద కూడా కూర్చుని ఉంది.

రవికుమార్ లేచి నిల్చుని మీటింగ్‌ని ప్రారంభిస్తూ, "ఈ అత్యవసర సమావేశానికి కమిటీ మెంబరు కాకపోయినా, ప్రత్యేక ఆహ్వానితురాలిగా కామ్రేడ్ వినోదను ఆహ్వానించాను. ఎవరికైనా అభ్యంతరం ఉంటే సంకోచించకుండా చెప్పవచ్చు" అన్నాడు.

తమ ఆమోదాన్ని సూచిస్తూ అంతా చప్పట్లు కొట్టారు.

చిరునవ్వుతోనే అందరికీ ధన్యవాదాలు తెలిపింది వినోద.

"మన సహోద్యోగిని అయిన రోసీతో మేనేజర్ పానకాలరావు అసభ్య ప్రవర్తనకి నిరసనగా మనం సమ్మె ప్రారంభించాం. అది నిరవధిక సమ్మెగా మారింది. మేనేజ్‌మెంట్ మొండి వైఖరి అవలంబిస్తున్నది. పిరికివందలైన మన సభ్యుల్లో కొందరు యాజమాన్యపు తొత్తులుగా మారి సమ్మెను నీరుగార్చే ప్రయత్నం చేస్తున్నారు. ఈ విషయా లన్నీ మీ కందరికీ తెలుసు.

"ఈ పరిస్థితుల్లో మనం సమ్మెను ఇంకా కొనసాగించాలా, వద్దా అనే కీలకమైన నిర్ణయం తీసుకోవడం కోసమే ఈ సమావేశం. కార్మిక వ్యతిరేక విధానాన్ని పాటిస్తున్న ప్రస్తుత ప్రభుత్వ వైఖరి కూడా మనకు అనుకూలంగా లేదు. పానకాలరావుని ఈ బ్రాంచి నుంచి బదిలీ చేయాలని చివరగా మనం డిమాండ్ చేశాం. అదీ వీలు కా దంటున్నది మేనేజ్‌మెంట్. బాగా ఆలోచించి నే నొక నిర్ణయం తీసుకున్నాను. మేనేజర్ బాంకింగ్ హాల్లో స్టాఫ్ అందరి సమక్షంలో నిలబడి బహిరంగంగా రోసీకి క్షమాపణలు చెప్పుకుంటే సమ్మె విరమిస్తాం. ఈ నిర్ణయాన్ని రేపే మనందరం వెళ్లి పానకాలరావుకి ఈ నిర్ణయాన్ని తెలియపరుస్తాం. ఏమంటారు?" అని గంభీరంగా అందరినీ ఒకసారి చూశాడు రవికుమార్.

కొద్ది క్షణాలపాటు ఆ గదిలో నిశ్శబ్దం.

ముందు ఎవరు మాట్లాడతారా అని అంతా ఒకరి ముఖా లొకరు చూసుకున్నారు.

"నిర్భయంగా, నిస్సంకోచంగా మీ మీ అభిప్రాయాలను వ్యక్తం చేయవచ్చు" అన్నాడు రవికుమార్.

"నేను మాట్లాడవచ్చా?" అడిగింది వినోద.

అందరూ ఆసక్తిగా ఆమె కేసి తలలు తిప్పి చూశారు.

"తప్పకుండా! అందుకేగా ప్రత్యేకంగా మిమ్మల్ని ఆహ్వానించింది" అన్నాడు రవికుమార్.

వినోద లేచి నిలుచోబోయింది.

"పరవాలేదు, కూర్చునే చెప్పండి" అన్నా రొకరు.

"అవును. ఫార్మాలిటీస్ అవసరం లేదు. మీరు కూర్చునే మాట్లాడొచ్చు" అన్నాడు రవికుమార్.

"మేనేజర్ రోసీతో అసభ్యంగా ప్రవర్తించా డన్నది మీ అభియోగం. ఆ రోజు మేనేజర్ కేబిన్‌లో అస లేం జరిగిందో వివరిస్తారా, రవికుమార్ గారూ?" అని రవి కేసి తీక్ష్ణంగా చూసింది వినోద.

రవి తడబడ్డాడు.

"అంటే, ఏమీ జరక్కుండానే మనం ఈ సమ్మె ప్రారంభించా మని మీ ఉద్దేశమా?" చిరాగ్గా అన్నాడు రవి.

"నే నలా మాట్లాడటం లేదు. రోసీతో మేనేజర్ పానకాలరావు అసభ్యంగా ప్రవర్తించా డని అంతా అంటున్నారు. అతను ప్రదర్శించిన ఆ అసభ్యత ఏమిటి అన్నదే నా ప్రశ్న. రోసీని అసభ్యంగా తిట్టాడా? ఆమెతో బూతులు మాట్లాడాడా? తన గదికి రమ్మన్నాడా? ఆమెను బలవంతంగా ముద్దుపెట్టుకున్నాడా? ఆమె చెయ్యి పట్టుకుని లాగాడా? లేక, ఇం కేమైనా చేశాడా?"

"ఆ సమయంలో కేబిన్‌లో రోసీ, పానకాలరావు ఇద్దరే ఉన్నారు. మీరు చెప్పిన వాటిలో ఏదైనా జరి గుండొచ్చు కదా?" కోపంగా చెప్పాడు రవి.


"మంచి మాటన్నారు. జరిగి ఉండొచ్చు. అంతేగాని, 'జరిగింది' అని మీరు కూడా చెప్పలేకుండా ఉన్నారు. అస లేం జరిగిందో తెలియనప్పుడు మరి ఈ గొడవంతా ఎందుకండీ!" నిదానంగా అంది వినోద.

కొద్ది క్షణాలు ఆ గదిలో నిశ్శబ్దం. ఆ తరువాత గుసగుసలు. చిన్నగా కలకలం.

"నిశ్శబ్దం! మీలో మీరు మాట్లాడుకోవటం కాదు. ఎవరైనా ఒక్కరు మాట్లాడండి!" అన్నాడు రవి కోపంగా.

ఎవరూ మాట్లాడటానికి ముందుకు రాలేదు.

"వినోదగారూ! అయితే మీ రంటున్న దేమిటి? కేబిన్‌లో ఏమీ జరక్కుండానే ముఖం కందిపోయి ఏడుస్తూ బయట కొచ్చిందంటారా రోసీ ఆ



రోజు? సమస్యను పక్కదారి పట్టించడానికి ప్రయత్నించకండి" ఆవేశంగా అన్నాడు రవి.

"ఆవేశపడకండి, రవీ! నిదానంగా ఆలోచించండి. కేబిన్‌లోంచి కళ్లు తుడుచుకుంటూ వచ్చింది రోసీ. సీట్లో కూర్చున్న తరువాత కూడా చాలాసేపు ఏడుస్తూనే ఉంది. మీ రంతా ఆమె చుట్టూ చేరి ఏవేవో ప్రశ్నలు వేశారు. వెక్కిళ్ల మధ్య ఏవో నాలుగు మాటలు గొణిగింది రోసీ. అంతే! మీకు మీరే అస్పష్టంగా ఒక దృశ్యాన్ని ఊహించుకున్నారు. ఆ బొమ్మకి ఒక చట్రం బిగించారు. ఆధారం లేని ఆ వ్యూహ దృశ్యాన్ని అందరికీ ప్రదర్శించి సమ్మె ప్రారంభించారు."

"మీ వాదమే నిజమైతే ఆనాడు అస లేం జరిగిందో రోసీ చెప్పవచ్చుగా? ఇంత జరుగుతున్నా మెదలకుండా ఉండిపోయిం దెందుకని?" అడిగా డొక సభ్యుడు.

"అదే ఆమె చేసిన తెలివితక్కువ పని. అసలు జరిగిం దేమిటో ఒప్పుకుంటే తను సస్పెండ్ అవుతానేమో నని భయపడింది రోసీ."

ఆ మాటలకు అంతా అవాక్కయిపోయారు.

నిశ్శబ్దాన్ని ఛేదిస్తూ అడిగాడు రవి - "వినోదా! మీరు రోసీతో మాట్లాడారా?"

"మొదటి నుంచీ జరిగిం దేమిటో ఆమె నోటితో వినాలని ప్రయత్నిస్తూనే వచ్చాను. 'దయచేసి న న్నేమీ అడక్కు. ఆ విషయం కెలికి నా మనసును మరింత బాధపెట్టకు, వినోదా!' అంటూ అసలు సంగతిని దాటవేస్తూ వచ్చింది రోసీ. ఏ మనుకుందో, ఏమో నిన్న తనే మా హాస్టల్‌కి వచ్చి, జరిగిందంతా నాతో చెప్పి కుమిలి కుమిలి ఏడ్చింది." అని, ఆ రోజు కేబిన్‌లో మేనేజర్‌కి, రోసీకి మధ్య జరిగిన ఉదంతాన్ని వివరించింది వినోద.

కాసేపు రవికి ఏం మాట్లాడాలో తోచలేదు. అంతా అప్రతిభులై చూస్తూండిపోయారు.


"మీ రెవరూ ఊహించని ఇంకో సంగతి కూడా వినండి. ఆ గొచ్చిన మైకంలో తప్పుల తడకగా, 'టు నర్ విత్ లవ్ - రోసీ!' అని టైపు చేసిన ఆ డి.వో. లెటర్ ఇంకా పానకాలరావు దగ్గరే ఉంది. ఆ ఆధారం ఒక్కటే చాలు రోసీని సస్పెండ్ చేయడానికి. కాని ఆ ఉత్తరాన్ని తన పై అధికారులకు చూపించ లే దింతవరకూ మన మేనేజర్. ఎందుకో తెలుసా? రోజీ జీతం మీద ఆమె కుటుంబం ఎంతగా ఆధారపడిందో మ నందరికంటే ఆయనకు బాగా తెలుసు. ఇప్పుడు చెప్పండి. మేనేజర్ పానకాలరావు మీ రనుకుంటున్నంత చెడ్డవాడా?"

ఎవరూ మాట్లాడలేకపోయారు.

"వినోదా! అయితే మేనేజర్ని కూడా కలిశావా నువ్వు?" అప్రయత్నంగా ఏకవచన ప్రయోగం చేసినందుకు సిగ్గుపడుతున్నట్లుగా నాలుక కొరుక్కుని, "సారీ!" అన్నాడు రవి.

అదేమీ పట్టించుకోలేదు వినోద.

"మీ వర్గపోరాట సిద్ధాంతంతో నే నేకీభవించలేకపోయినా, స్టాఫ్ యూనియన్లో నేనూ ఒక సభ్యురాలినే అన్న విషయం మరిచిపోను, రవీ! మన మంతా కలిసి సమ్మె చేస్తున్నప్పుడు నేను మాత్రం వ్యక్తిగతంగా



మేనేజర్ని కలుసుకుని మాట్లాడటం యూనియన్ విధులకి విరుద్ధమని నాకూ తెలుసు. ఆ ఉత్తరం సంగతి టెలిఫోన్ చేసి ఆయనే చెప్పాడు నాకు" అన్నది వినోద.

కాసేపు ఆలోచించి చెప్పాడు రవి -

"రేపటి నుంచి మనం సమ్మె విరమిస్తున్నాం. ఏమంటారు?"

అంతా ఆనందంగా చప్పట్లు కొట్టారు.

"ఈ సమస్యను ఇంత సుముఖంగా పరిష్కారం చేసిన వినోద గారికి మన యూనియన్ తరపున ధన్యవాదాలు తెలుపుకుంటున్నాను. అంతేకాదు, మీ అందరి అంగీకారంతో వినోద గారిని మన కమిటీ మెంబర్గా కో-ఆప్ట్ చేసుకుంటున్నాం." అన్నాడు రవి వినోద కేసి అభినందనపూర్వకంగా చూస్తూ.

"మీ అభిమానానికి కృతజ్ఞతలు. కాని నాకు ఆసక్తి లేదు. న న్నొదిలేయండి. సాధారణ సభ్యురాలిగా నా సహకారం మీ కెప్పుడూ ఉంటుంది" అని చేతులు జోడించింది వినోద.

** ** **

పది రోజులకి పైగా సాగిన సమ్మె సుముఖంగా ముగిసింది. అంతా హాయిగా ఊపిరి పీల్చుకున్నారు. స్టాఫ్ మెంబర్ల మధ్య సుహృద్భావం ఏర్పడింది.

సాయంత్రం ఐదు గంటలు కావస్తోంది. డిపార్ట్మెంట్లో కుర్చీలు ఖాళీ అవుతున్నాయి. చేతి అద్దంలో ముఖం చూసుకుంటూ పెదాలకు రంగు పూసుకుంటున్నది రోసీ.

"రోసీ! నీకు పెళ్లి చేసుకోవాలని లేదా?" హఠాత్తుగా వచ్చిన ఆ ప్రశ్నకి ఉలిక్కిపడి తిరిగి చూసింది రోసీ.

కుర్చీ వెనుక నిలబడి ఉన్న వినోద కనిపించింది.

"చెప్పు, రోసీ! వివాహం చేసుకుని జీవితంలో స్థిరపడాలని లేదా నీకు?" ఆమె భుజం మీద చేతులు వేసి అడిగింది వినోద.

"అన్నీ తెలిసి కూడా అడుగుతున్నావా? ముప్పై అయిదేళ్లు దాటిన ఆడదాన్ని ఏ మగాడు చేసుకుంటాడు?" నవ్వడానికి ప్రయత్నిస్తూ అన్నది రోసీ.

"ఏం, నలభై అయిదేళ్లు దాటిన మగాడు చేసుకోవచ్చుగా!"

"ఒక్క నెల నేను జీతం ఇంటికి తీసుకుని పోకపోతే మా ఇంట్లో అందరూ పస్తు పడుకోవాలి. నీకు తెలియదా?"

"తెలుసు. పెళ్లైనంత మాత్రాన నీ జీతం మీ వాళ్లకు పంపుకోకూడ దని రూ లేమైనా ఉందా?" అడిగింది నవ్వుతూ వినోద.

"రూలు సంగతి నాకు తెలియదు. కాని అలా పంపుకోవచ్చు అనేటంతటి అమాయకులైన మగవాళ్లు ఉండరని మాత్రం చెప్పగలను."

"అమాయకుడో, కాదో చెప్పలేను గాని, పెళ్లయ్యాక కూడా భార్య తన జీతాన్ని ఇష్టం వచ్చినంత కాలం తల్లిదండ్రులకు పంపుకోవచ్చు అనగల ఒక మంచి మనిషి గురించి నాకు తెలుసు."

"కలలో గాని కనిపించేడా?" నవ్వింది రోసీ.

"కాదు, ఈ పేపర్లో" అంటూ పత్రికలో పడిన ఆ ప్రకటన చూపించింది వినోద.

" - 45 సంవత్సరాలు. మంచి ఉద్యోగం, సొంత ఇల్లు ఉన్న వరుడికి 35 సం॥ల వధువు కావలెను. కుల, మతాల పట్టింపు లేదు. ఉద్యోగం చేయుచున్నచో ఆమె తన జీతం తల్లిదండ్రులకు పంపుకోవడాని కెటువంటి అభ్యంతరమూ లేదు. వివరాలతో పోస్టు బాక్స్ నెం.314కి రాయవచ్చును."

రోసీ ఆలోచిస్తూ ఉండటం గమనించి, డ్రాయర్లోంచి ఒక తెల్ల కాగితం తీసి ఆమె ముందు పెట్టింది వినోద.

"దీని మీద సంతకం మాత్రం పెట్టు, చాలు. మిగతావి నేను చూసుకుంటాను."

సంతకం చేసిచ్చింది రోసీ.

"నీ బయోడేటా అంతా నాకు తెలుసు. ఎత్తు మాత్రం చెప్పు."

"అయిదడుగుల మూడంగుళాలు. బరువు అక్కర్లేదా?" నవ్వుతూ అడిగింది రోసీ.

"ఒద్దులే! అతను భయపడతాడేమో, పాపం!" అని కాగితాన్ని హేండ్బేగ్లో పెట్టుకుంది వినోద.

** ** **

వినోద ఆఫీసుకు రావటంలేదు.

అడ్మినిస్ట్రేషన్ సెక్షన్ కళ కోల్పోయినట్లుగా ఉంది. ఆఫీసు స్టాఫే కాదు, బ్యాంక్కు వచ్చిపోయే కస్టమర్లు కూడా ఏదో విలువైన వస్తువు కనిపించనట్లుగా ఖాళీగా కనిపించే ఆమె సీటు కేసి దిగులుగా చూసి వెళ్తున్నారు. ఉత్కంఠని భరించలేని కొందరు విమెన్స్ హాస్టల్కి ఫోన్ చేసి కనుక్కున్నారు. వినోద హాస్టల్ ఖాళీ చేసిందని, తక్కిన వివరా లేవీ తమకు తెలియవని సమాధానం వచ్చింది.

ఆఫీసులో రకరకాల ఊహాగానాలు మొదలయ్యాయి. వారం రోజుల తరువాత ఒకరోజు ఆఫీసులో హఠాత్తుగా ప్రత్యక్షమైంది వినోద. ఏదో ఉపగ్రహానికి వెళ్లి తిరిగి వచ్చిన మనిషిని చూడటానికి వచ్చినట్లుగా ఒక్కొక్కరే వచ్చి ఆమెను పలకరించి వెళ్లసాగారు.

"రేపు సాయంత్రం 'ఉడ్లాండ్స్'లో ఒక చిన్న పార్టీ ఏర్పాటు చేశాను. ఎందుకు, ఏమిటి అని అడక్కండి. పార్టీకి మాత్రం తప్పకుండా రండి!" అని తనకు బాగా పరిచయమైన వారి నందరినీ ఆహ్వానించింది వినోద.


** ** **

ఉడ్లాండ్స్ లాన్లో వంద కుర్చీలదాకా వేసి ఉన్నాయి. సాయంత్రం ఆరున్నర దయ్యేసరికి కుర్చీలన్నీ నిండిపోయాయి. వినోద ఆహ్వానించిన వాళ్లందరూ వచ్చారు పార్టీకి. చాలా నిరాడంబరంగా, కాని అందంగా అలంకరించబడిన వేదిక మీద రెండు కుర్చీలూ, మైకు ఉన్నాయి.

అర్ధగంట నుంచి అతిథు లందరి చూపులూ ఆ వేదిక మీదే కేంద్రీకృతమయ్యాయి.

అది వినోద 'మేరేజ్ రిసెప్షన్' అన్న సంగతి మాత్రం అందరికీ తెలిసిపోయింది.

అందరిలోనూ ఒకటే ప్రశ్న - వినోద భర్త ఎవరు?




ఇంతకీ వినోద కనిపించ దేమిటి?

రిసెప్షన్‌కి వచ్చే వాళ్లకి వినోద తరపున ఇం కెవరో స్వాగతం పలుకుతున్నారే కాని, అన లామె జాడే లేదు. ముందు వరుసలో కూర్చున్న స్టాఫ్‌లో రకరకాల వ్యాఖ్యానాలూ, ఊహాగానాలూ చెలరేగుతున్నాయి.

"మేనేజర్ పానకాలరావునే చేసుకుని ఉంటుంది."

"కాదు. మన యూనియన్ సెక్రటరీ రవి కుమార్‌ని ప్రేమించి ఉంటుంది. రహస్యంగా ఇద్దరూ ఏ గుడిలోనో దండలు మార్చుకుని ఉంటారు."

"మీ ఇద్దరూ తప్పు. మన ప్యూన్ త్యాగరాజు లేడూ, వాడినే వరించి ఉంటుంది. ఎంతైనా కాంట్రాక్టరు కొడుకు కదా! అందుకే మన కెవరికీ చెప్పలేదు."

ఈ ముగ్గురూ అక్కడ కనిపించకపోవడమే కాదు, ఆ రోజు ఆఫీసుకు కూడా సెలవు పెట్టడం వాళ్ల ఊహాగానాలకి మరింత బలా న్నిచ్చింది.

ఏడు గంటలు కావస్తూండగా అందరి తలలూ ఒక్కసారిగా వెనక్కి తిరిగాయి.

పచ్చని పచ్చిక మీద నడిచి వస్తూ కనిపించింది వినోద. పెదాల మీద చెరగని అదే చిరునవ్వు. కుంకుమపువ్వు అంచు తెల్లని కాటన్ చీర, లేత పసుపురంగు బ్లౌజు, మెడలో సన్నని ఒంటిపేట గొలుసు - అతి సామాన్యమైన అలంకరణలో అందంగా నడిచి వచ్చింది. ఆమె పక్కన ఎవరూ లేకపోవడం చూసి అంతసేపూ ఆత్రుతగా ఎదురు చూసిన అందరికీ ఆశాభంగమైంది.

వేదిక నెక్కి మైకు ముందు నిలుచుని ఒకసారి చిరునవ్వుతో అందరినీ చూసింది వినోద.

"ఆలస్యానికి క్షమించాలి. మే మిద్దరం ఈ స్టేజి మీద కూర్చోవడం, మీ రంతా మమ్మల్ని ఆశీర్వదించి ఆకాశాని కెత్తేస్తూ ఏదో నాలుగు మాటలు చెప్పడం, చివర్న మేం కృతజ్ఞతలు తెలుపుకోవడం - అంతా ఏదో రొటీన్‌గా, సాంప్రదాయికంగా ఉంటుంది. నాకు ఇబ్బందిగానూ అనిపిస్తుంది. నేనూ మీలో ఒకదాన్నిగా ఉండాలనుకుంటున్నాను. అంచేత మీకు అభ్యంతరం లేకపోతే నేనూ, మా ఆయనా మీ మధ్యనే కూర్చుందామని ఉంది. మీ కుర్చీలను ఒక వలయాకారంగా తిప్పుకుంటారా?" అని వేదిక దిగింది వినోద.

ఆమె ఈ మాటలంటున్నప్పుడు పానకాలరావు, రవికుమారూ, త్యాగరాజు లాన్ లోపలికి ప్రవేశించారు.

మూడు వరుసల్లో 'మ్యూజికల్ ఛెయిర్స్'వలె వలయంగా తిప్పుకున్నారు కుర్చీలను. మధ్యలో రెండు కుర్చీలు వేసుకుని ఒకదాంట్లో ఆసీనురాలైంది వినోద. రెండో కుర్చీ ఖాళీగానే ఉంది ఇంకా!

"ఇంకా ఎంతసేపండీ, బాబూ! సస్పెన్స్ భరించలేక చచ్చిపోతున్నాం" అన్నా రెవరో.

"ఒక్క రెండు నిముషాలు నన్ను మాట్లాడనివ్వండి" అంటూ ప్రారంభించింది వినోద.

"యూనివర్సిటీలోంచి జీవిత మనే పాఠశాలలోకి నేను పెట్టిన మొదటి అడుగు మన ఆఫీసు. మీ అందరి మధ్య నేను గడిపిన ఈ సంవత్సరం రోజుల్లో నే నెన్నో విషయాలు నేర్చుకున్నాను. మరిచిపోలేని మ రెన్నో మధు రానుభవాల్ని మిగుల్చుకున్నాను. మీరు నా పట్ల చూపించిన ఆదరాభిమానాలను నే నెప్పుడూ గుర్తుంచుకుంటాను.

"మనిషి మంచితనం మీద నాకు నమ్మక ముంది. నగటు మనుషుల్లో ఏ వ్యవస్థలోనైనా, ఏ కాలంలోనైనా మంచివాళ్ల శాతమే ఎక్కువగా ఉంటుంది. కాబట్టే మానవ జాతి ఈ భూమ్మీద ఇంకా మనగలుగుతోంది.

"నేను అయిదేళ్ల పసిదాన్నిగా ఉన్నప్పుడు మా ఊళ్లో తుఫా నొచ్చింది. నదీ పొంగి దాదాపు ఊరంతా వరదల్లో కొట్టుకునిపోయింది. అప్పుడు పన్నెండేళ్ళయినా నిండని పసివా డొకడు ప్రాణాలకు తెగించి ప్రవాహంలో కొట్టుకుపోతున్న నన్ను కాపాడి గట్టుకు చేర్చాడు. అనాథగా మిగిలిపోయిన నన్ను పెంచి, పెద్దదాన్ని చేశాడు. తను కష్టం చేసి నన్ను చదివించాడు. నే నీరోజు మీ ముందు నిలబడి ఇలా మాట్లాడగలుగుతున్నా నంటే అందుకు కారణం అతడే. అతను చదువుకోలేదు. కాని అన్ని చదువుల్ని మించిన సంస్కారం, సహృదయం, వ్యక్తిత్వం మూర్తీభవించిన మంచి మనిషి. అందుకే నా జీవిత సహచరుడుగా ఆ మనిషినే ఎంచుకున్నాను."

అంతా తిరిగి తిరిగి చూస్తున్నారు ఆ అదృష్ట అదృశ్య వ్యక్తి ఎవరా అని?

వాళ్ల అవస్థ గమనించి చిన్నగా నవ్వుకుంది వినోద.

"లేచి రండీ! వీళ్లంతా మిమ్మల్ని చూడా లనే ఉబలాటంతో ఉక్కిరిబిక్కిరి అవుతున్నారు" అంటూ మెడ సారించి తన చుట్టూ ఉన్న కుర్చీలను దాటి చూపులు మరల్చింది.

కొంచెం దూరంగా పచ్చిక మీద క్రోటన్ మొక్కల దగ్గర ఒంటరిగా ఆసీనుడై ఉన్న అతను పైకి లేచాడు. చేనేత పంచె మీద, పొట్టి చేతుల ఖద్దరు చొక్కా ధరించి ఉన్నాడు. పట్నవాసపు ఛాయలు మచ్చుకైనా లేవు. కాని ఆరోగ్యంగా కనిపిస్తున్న అతనిలో ఇదీ అని చెప్పలేని ఏదో ఆకర్షణ దాగి ఉంది. మెల్లగా నడిచి వచ్చి అందరి మధ్యా నిలబడి చేతులు జోడించాడు. వినోద పక్కన కూర్చున్నాడు.

"ఈయన పేరు దాసు. ఈ రోజే మే మిద్దరం రిజిస్ట్రా రాఫీసులో వివాహం చేసుకున్నాం. సాక్షి సంతకాలు చేసిన మన మేనేజర్ పానకాలరావు గారికీ, రవి గారికీ, త్వరలోనే సేవధ్యగాయకుడుగా మీ అందరికీ పరిచయం కానున్న త్యాగరాజుకీ మా ధన్యవాదాలు.

"ఈ సందర్భంలో మీ కందరికీ అందమైన ఆశ్చర్యం కలిగించే మరో సంగతి. మన పానకాలరావు గారూ, రోసీ త్వరలోనే ఆదర్శ దంపతులు కాబోతున్నారు. మీ అందరి సమక్షంలో అడ్వాన్స్‌గా నా శుభాకాంక్షలు తెలియజేస్తున్నాను" అన్నది వినోద.

"ఏమీ ఎరగనట్లు మాట్లాడుతోంది. మా పెళ్లికి అసలు సూత్రధారి ఆవిడేనండోయ్!" రవి కుమార్ భుజాల మీద చెయి వేసి కూర్చుని ఉన్న పానకాలరావు అందరికీ వినబడేలా అరిచాడు నవ్వుతూ.

"వీ ళ్లిద్దరి మధ్య రాయబారం నడిపాను. అంతే నేను చేసింది." నవ్వుతూ చెప్పింది వినోద.

"భలే, భలే! రెండు క్లైమాక్స్ లన్నమాట!" అని పెద్దగా అన్నా రెవరో.

పానకాలరావుకి వెనుక సీట్లో సిగ్గుపడిపోతూ తలొంచుకుని కూర్చున్న రోసీని చూసి అభినందిస్తూ అంతా కరతాళ ధ్వనులు చేశారు.

"చివరగా ఇంకొక్క సంగతి. నేను ఉద్యోగానికి రాజీనామా ఇచ్చాను. నేను, మా ఆయనా కలిసి మా ఊళ్లో సరికొత్త ఆశయాలతో, వినూత్న విధానాలతో ఒక చిన్న బడి ప్రారంభిస్తున్నాం. ప్రభుత్వం కూడా మా ఈ ప్రయత్నాన్ని ప్రోత్సహిస్తున్నది. ఆ పని మీదే మే మిద్దరం రేపు హైదరాబాదు బయలుదేరుతున్నాం. మా బడి ప్రారంభోత్సవానికి మీ కందరికీ ఆహ్వానం పంపుతాము. మీ రందరూ వచ్చి మా బడి పిల్లల్ని ఆశీర్వదించాలని మా ఆకాంక్ష. సెలవు!" అని చేతులు జోడించి దాసు పక్కన కూర్చుంది వినోద.

కరతాళ ధ్వనుల మధ్య లాన్‌లోని పచ్చగడ్డి పులకించిపోయింది.

## జూలై నెల 'కథా ప్రభ'లో
## కె. లక్ష్మి సమీరజ రచన
## 'దాక్షాయణి'